

జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 05 సంచిక : 220 పేజిలు : 08, వెల రూ. 5రూ/ శనివారం - 11 - జనవరి- 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba


# పుతిన్ కలవాలనుకుంటున్నారు.. భేటీ ఏర్పాటుచేస్తా



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనతో భేటీ కావాలని కోరుకుంటున్నారని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనతో భేటీ కావాలని కోరుకుంటున్నారని అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.రిపబ్లికన్ గవర్నర్లతో భేటీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుతిన్తో సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అయితే ఎప్పుడు అనే విషయం మాత్రం వెల్లడించలేదు. తాను అధికారంలోకి వచ్చిన అనంతరం మిగతా 2లో

# నా ఉరిశిక్షను రద్దు చేయండి.. కోర్టుకు ట్విన్ టవర్స్ దాడి మాస్టర్‌మైండ్



అమెరికా చరిత్రలో అత్యంత విషాదాన్ని మిగిల్చిన ట్విన్ టవర్స్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది.

వాషింగ్టన్ : అమెరికా చరిత్రలో అత్యంత విషాదాన్ని మిగిల్చిన ట్విన్ టవర్స్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. వేలాది మంది అమయాకుల్ని పొట్టనపెట్టుకున్న ఖలీద్ షేక్ మహమ్మద్ ఉరిశిక్ష నుంచి తనకు ఉపశమనం కల్పించాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఆ పిటిషన్‌పై విచారణ జరగకుండా జోబైడెన్ ప్రభుత్వం అడ్డుకుంది. ఒసామా బిన్ లాడెన్ మిగతా 2లో

## ఒకవైపుగా తెరవాల్సిన గేట్లను

# మరోవైపు తెరిచారు

**అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం ప్రశ్నించారు**

**అధికారుల వైఫల్యాలను సీఎం చంద్రబాబు గమనించారన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి**

**ఇన్‌ఛార్జిగా పెట్టిన డీఎస్పీ అక్కడ లేకుండా ఎక్కడికో వెళ్లారని వెల్లడి**

**ఒకవైపుగా తెరవాల్సిన గేట్లను మరోవైపు తెరిచారన్న మంత్రి**



నెల్లూరు: తిరుపతి తొక్కిసలాట ఘటనలో అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం చంద్రబాబు ప్రశ్నించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా..35 మందికి గాయాలయ్యాయని చెప్పారు. క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి స్విమ్స్కు తరలించినట్లు చెప్పారు. చనిపోయిన ఆరుగురికి వెంటనే పోస్టుమార్టం నిర్వహించినట్లు మంత్రి వివరించారు. రెవెన్యూ అధికారి సమక్షంలో మృతదేహాలను స్వస్థలాలకు తరలించామన్నారు. నెల్లూరులో నిర్వహించి న మీడియా సమావేశంలో ఆనం రామ నారాయణరెడ్డి మాట్లాడారు."స్పృహ తప్పిన మహిళను బయటకు తీసుకెళ్లే సమయంలో తొక్కిసలాట జరిగిందని కొంతమంది చెప్పారు. టోకెన్లు ఇస్తున్నారన్న ఆతృతతో అందరూ ఒక్కసారిగా గేట్ల మీద పడ్డారు. మిగతా 2లో

## ఏపీ యువత నైపుణ్యాల మెరుగుదలకు

# ఇన్ఫోసిస్ ఉచిత సహకారం

స్కిల్ సెన్సస్ ప్రీ-వాలిడేషన్ కోసం ఇన్ఫోసిస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం

మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు

ఇన్ఫోసిస్ చొరవ అభినందనీయమన్న ఐటీ, విద్యాశాఖ మంత్రి

ఆర్థిక వనరులతో సంబంధం లేకుండా సహకారం అందించనున్న టెక్ దిగ్గజం

రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనకరంగా రూపుదిద్దేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడానికి ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ ముందుకొచ్చింది.

డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ లెర్నింగ్ పాత్‌వేస్‌కు విద్యార్థులను కనెక్ట్ చేసే యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లను సృష్టించనుంది. దీంతో, నిరంతర అభ్యాసాన్ని సులభతరం చేస్తుంది.





రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేందుకు ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్కిల్ సెన్సస్ కార్యక్రమాన్ని మరింత ప్రయోజనకరంగా రూపుదిద్దేందుకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడానికి ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ ముందుకొచ్చింది. ఎటువంటి ఆర్థిక వనరులతోనూ సంబంధం లేకుండానే స్కిల్ సెన్సస్‌లో భాగంగా జనరేటివ్ ఏఐని ఉపయోగించి నైపుణ్యాలను అందించనుంది. ఇందుకోసం ఇన్ఫోసిస్, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. మిగతా 2లో

## తిరుపతి తొక్కిసలాట ఘటనపై చంద్రబాబు హైడ్రామా



**ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన క్షేత్రంగా వున్న తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలు హైడ్రామాను తలపిస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు.**

గుంటూరు: ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన క్షేత్రంగా వున్న తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై సీఎం చంద్రబాబు తీసుకున్న చర్యలు హైడ్రామాను తలపిస్తున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఆరోపించారు. గుంటూరు క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ తొక్కిసలాట ఘటనకు బాధ్యులైన టీటీడీ చైర్మన్, ఈఓ, జేఈఓ, మిగతా 2లో

# జాట్లకు మీరు ద్రోహం చేశారు

ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ ఆరోపణ

ఆ సామాజికవర్గాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్

ఓటరు జాబితా తారుమారుకు బీజేపీ కుట్ర అని మండిపాటు

జాట్లు ఇప్పుడు గుర్తొచ్చారా? అంటూ కేజ్రీపై పర్వేశ్ వర్మ ఆగ్రహం



న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఢిల్లీ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల వేడి పెరుగుతోంది. తాజాగా మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ 'జాట్'అస్త్రాన్ని ప్రయోగించారు. ఆ సామాజికవర్గాన్ని కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి గురువారం కేజ్రీవాల్ లేఖ రాశారు.

# యుద్ధంలో కాదు.. బుద్ధుడిలోనే భవిష్యత్తు

**'ప్రవాసీ భారతీయ దివస్'లోప్రధాని మోదీ స్పష్టీకరణ**

మనందరి జీవితాల్లో ప్రజాస్వామ్యం ఒక అంతర్భాగం

ఘనమైన వారసత్వం, సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన భారత్ వైపు ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయని, నేడు మనం చెప్పే మాట వింటున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.



భువనేశ్వర్: ఘనమైన వారసత్వం, సంస్కృతీ సంప్రదాయాలు కలిగిన భారత్ వైపు ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయని, నేడు మనం చెప్పే మాట వింటున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. భవిష్యత్తు అనేది యుద్ధంలో లేదు, బుద్ధుడిలో ఉందని ప్రపంచానికి చెప్పగల శక్తి భారత్‌కు మిగతా 2లో

## జగన్ శవరాజకీయాలు మళ్లీ మ్మొదలుపెట్టారు



- తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత స్పందించారు.
- తిరుమల వెంకన్న వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం వెళ్లి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

తిరుపతి తొక్కిసలాట ఘటనపై ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మిగతా 2లో

## ప్రాణాలు తీసిన వారిని ఎందుకు కాపాడుతున్నారు?



- తిరుపతి తొక్కిసలాటకు టీటీడీ ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో, ఎస్పీ కారణమన్న రోజా
- సమాజ మెప్పు కోసం ఈ విషయాన్ని పవన్ అంగీకరించారని వ్యాఖ్య
- బాధ్యులపై చర్యలను ఎందుకు కోరడం లేదని ప్రశ్న

కూటమి ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యం కారణంగా ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా ఆవేదనవ వ్యక్తం చేశారు. ఈ ఘటనకు టీటీడీ చైర్మన్, ఈవో, అదనపు ఈఓ, మిగతా 2లో

వంద కేసులు పెట్టినా ఎదుర్కొంటా

రేవంత్ రెడ్డిని సీఎంగా ఎన్నుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టమని..ఒక్క సీఎంను ఎన్నుకుంటే ఇంకో అర డజన్ మంది ఫ్రీ గా వచ్చారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైరికల్ విమర్శలు చేశారు.

రాష్ట్రంలో 1 + 6 ఆఫర్ సీఎం వ్యవస్థ సాగుతోందని.. స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడు చూడలేదేమోనన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ పాలనను తప్పుబడుతూ కేటీఆర్ ట్వీట్ చేశారు

మీడియాతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఏసీబీ అధికారులు 82 ప్రశ్నలు తిప్పి తిప్పి అడిగారు

ఫార్ములా-ఈ వ్యవహారంలో పైసా అవినీతి లేదని చెప్పినట్లు వెల్లడి

## తెలంగాణ కోసం చస్తాను తప్ప

# తలవంచేది లేదు



హైదరాబాద్: రేవంత్ రెడ్డిని సీఎంగా ఎన్నుకోవడం తెలంగాణ రాష్ట్ర ప్రజల అదృష్టమని..ఒక్క సీఎంను ఎన్నుకుంటే ఇంకో అర డజన్ మంది ఫ్రీ గా వచ్చారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైరికల్ విమర్శలు చేశారు. మిగతా 2లో

## అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన హైడ్రా



- నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది.
- నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేస్తోంది.
- భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి.

హైదరాబాద్, : నగరంలోని మణికొండలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపించింది. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో ఆక్రమణలను కూల్చివేస్తోంది. భారీ పోలీసు బందోబస్తు మిగతా 2లో

# తెలంగాణ కోసం చస్తాను తప్ప తలవంచేది లేదు



సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ పాలనను తప్పుబడుతూ కేటీఆర్ ట్వీట్ చేశారు రాష్ట్రంలో 1 + 6 ఆఫర్ సీఎం వ్యవస్థ సాగుతోందని.. స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడు చూడలేదేమోనన్నారు. వికారాబాద్ సీఎం తిరుపతి రెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలని ట్వీట్ లో పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి నాది ఒక చిన్న విన్నపమని..మీది ప్రజా పాలన కాబట్టి ప్రజలకి మీ అనుముల సీఎంలలో ఎవరు కావాలో ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నానని.. ఐవీఆర్ఎస్ పద్ధతి పెడితే బాగుంటుందేమో చూడండని వంగ్యంగా అభ్యర్థించారు.కేటీఆర్ తన ట్వీట్ లో రాష్ట్రంలో అనుముల కుటుంబ పాలన..అనుముల రాజ్యాంగం నడుస్తోందంటూ తిరుపతిరెడ్డికి వికారాబాద్ లో లభించిన స్వాగత వీడియోను పోస్టు చేశారు. కనీసం వార్డు మెంబర్ కూడా కాని రేవంత్ సోదరుడు అనుముల తిరుపతి రెడ్డికి వికారాబాద్‌లో మంత్రులను మించిన పోలీసు బందోబస్తు, కాన్వాయ్ అని..బూట్లు తీయించి, స్కూల్ పిల్లలను ఎండలో నిలబెట్టి, ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రికి చేసినట్టు పరేడ్ చేయించారని..ఎవని పాలయ్యిందిరో తెలంగాణ అంటూ కేటీఆర్ ప్రశ్నించారు.కాగా సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ పాలనపై కేటీఆర్ చేసిన విమర్శల పట్ల నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో సీఎం కేసీఆర్ పాలనలో కేటీఆర్, హరీష్ రావు, కవిత, సంతోష్ కుమార్, హిమాన్షులు సాగించిన అధికార దర్పం మాటేమిటంటూ ప్రశ్నిస్తున్నారు. నాటి సంగతులు విస్మరించి నేడు ఈ నీతి ప్రవచనాలు ఏమిటంటూ కామెంట్ చేస్తున్నారు.'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలవంతంగా పెట్టించిన కేసులో విషయం ఏమీ లేకపోవడంతో ఏసీబీ అధికారులు కూడా ఇబ్బందులు పడ్డారు. 'పాడిందే పాడరా' అన్నట్లు 82 ప్రశ్నలను తిప్పి తిప్పి అడిగారు. తెలంగాణ ఆరాధ్య దైవం, తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్ నాయకత్వంలో గడిచిన పదేళ్లుగా నిబద్ధతతో, పైసా అవినీతికి తావు లేకుండా పనిచేశా అని చెప్పా. ఏసీబీ మళ్లీ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వెళ్తా.ఇలాంటి కేసులు వంద పెట్టినా ఎదుర్కొంటా. ఏడాది కాలంగా లగచర్ల, హైడ్రా, విద్యుత్ చార్జీల పెంపు వంటి అనేక అంశాలపై కొట్లాడుతున్నాం. కేసులు పెట్టి మా కేడర్, ప్రజల దృష్టిని రేవంత్ మళ్లించలేరు. అవసరమైతే తెలంగాణ కోసం చస్తాను తప్ప ఇలాంటి కేసులకు తలవంచేది లేదు..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ కేసులో ఏసీబీ నోటీసులతో విచారణకు హాజరైన కేటీఆర్.. గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఉదయం విచారణకు వెళ్లే ముందు నందినగర్ నివాసం వద్ద కూడా ఆయన మాట్లాడారు.

### అణా పైసా అవినీతి లేదని చెప్పా

'తెలంగాణకు పెట్టుబడులు తేవడం, ఎలక్ట్రిక్ వాహనాలకు రాష్ట్రాన్ని హబ్‌గా మార్చాలనే దూరదృష్టితో, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచడంతో పాటు ప్రపంచం దృష్టిని ఆకర్షించాలనే ఉద్దేశంతోనే కష్టపడి ఫార్ములా ఈ రేస్‌ను తెచ్చానని చెప్పా. ఇందులో అణాపైసా అవినీతి లేదని స్పష్టం చేశా. అలాంటి గలీజు పనులు చేయడం రేవంత్‌కు అలవాటు అని కుండబద్ధలు కొట్టి చెప్పా. ఇక్కడ నుంచి డబ్బులు పంపాం.. డబ్బులు అందినట్లు ఎఫ్ఈఓ (ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్) వాళ్లు ధ్రువీకరించారు. ఇదే విషయాన్ని చెపితే ఏసీబీ అధికారులు నీళ్లు మింగుతున్నారు. ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లిన రేవంత్ ఇతరులను కూడా పంపి పైశాచిక, శునకానందం పొందాలని చూస్తున్నాడు. రేవంత్ తరహాలో నేను లుచ్చా పనులు చేయలేదు. కేబినెట్‌లో ఉంటూ లాండ్ క్రూజర్లు కొనుగోలు చేయలేదు. బావ మరుదులకు కోట్లాది రూపాయల కాంట్రాక్టు ఇవ్వలేదు. రేవంత్ తరహాలో డబ్బు సంచులతో దొరకలేదు. పెట్టుబడులు తెచ్చేందుకు విదేశాలు తిరిగా. రేవంత్ పెట్టే కేసులకు భయపడేవారెవరూ తెలంగాణలో కానీ బీఆర్ఎస్‌లో కానీ లేరు..' అని కేటీఆర్ అన్నారు.

### రేవంత్‌ను ఎవరూ సీఎంగా గుర్తించడం లేదు

'ఇదొక లొట్టపీసు కేసు.. ఆయనో లొట్టపీసు సీఎం. రాష్ట్రంలో రేవంత్‌ను ఎవరూ ముఖ్యమంత్రిగా గుర్తించడం లేదు. తనను గుర్తించని వారిపై కేసులు పెట్టి లోపలేస్తున్నడు. ఏడాది తర్వాత కూడా ఆయనను ఎవరూ సీఎంగా గుర్తు పట్టకపోతే నేనేం చేయాలి. కేసులకు భయపడేది లేదు, బాధపడేది లేదు. లేని అవినీతిని పట్టుకుందామని ప్రయత్నిస్తే ఎక్కడ దొరుకుతుంది? ఏసీబీకి రేవంత్ మళ్లీ ప్రశ్నలు పంపితే తిరిగి పిలుస్తారేమో. న్యాయస్థానాల మీద విశ్వాసం ఉంది. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరవుతా. కేసీఆర్ సైనికులుగా ఈ ఏడాదంతా రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలు, ఆరు గ్యారంటీల అమలుపై నిలదీస్తూనే ఉంటాం. ఎంత కొట్టినా రైతు భరోసా, రూ.4 వేల ఆసరా పెన్షన్, మహిళలకు ప్రతి నెలా రూ.2,500, 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ గురించి మాట్లాడుతాం. పార్టీ నాయకులు, కార్యకర్తలకు కష్టం వస్తే మేమున్నామంటూ వచ్చిన వారందరికీ శిరసు వంచి నమస్కరిస్తున్నా..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ఏపీ యువత నైపుణ్యాల మెరుగుదలకు ఇన్ఫోసిస్ ఉచిత సహకారం

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద స్కిల్ సెన్సస్ డాటా ప్రీ-వాలిడేషన్‌కు సహకారం అందించేందుకు ఇన్ఫోసిస్ ముందుకు రావడం అభినందనీయమని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రశంసించారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో యువత ప్రస్తుత నైపుణ్యాలను అంచనా వేసి, మార్కెట్ డిమాండ్ కు తగ్గట్టుగా వారికి స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వడానికి మార్గం సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాల లక్ష్య సాధనలో భాగస్వామి కావడానికి ఇన్ఫోసిస్ ముందుకు రావడం హర్షణీయమని లోకేశ్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫోసిస్ ప్రతినిధులు సంతోష్, తిరుమల, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఉన్నతాధికారులు గణేష్ కుమార్, దినేష్ కుమార్, రఘు పాల్గొన్నారు.

### యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లతో నేర్చుకోవడం సులభం

డిజిటల్ లెర్నింగ్‌లో భాగంగా ఇన్ఫోసిస్ సంస్థ లెర్నింగ్ పాత్‌వేస్‌కు విద్యార్థులను కనెక్ట్ చేసే యూజర్ ఫ్రెండ్లీ ఇంటర్‌ఫేస్‌లను సృష్టించనుంది. దీంతో, నిరంతర అభ్యాసాన్ని సులభతరం చేస్తుంది. పరిశ్రమ అవసరాలను తీర్చడానికి ఏపీఎస్ఎస్‌డీసీకి సహకరిస్తుంది. ఔత్సాహికులకు ఉచితంగా నేర్చుకునే అవకాశాలను కల్పించడం, సాంకేతికత అభివృద్ధి, డిజిటల్ ప్లాట్‌ఫామ్ నిర్వహణను ఇన్ఫోసిస్ చేపడుతుంది. అభ్యర్థుల నైపుణ్యాలను సమర్థవంతంగా అంచనా వేయడానికి 'జనరేటివ్ ఇన్ఫోసిస్ డిజిటల్ ప్లాట్ ఫామ్'ను అభివృద్ధి చేసి అందిస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్ వివిధ పరిశ్రమలలో అవసరమైన నైపుణ్యాలను సూచిస్తుంది. తద్వారా అభ్యర్థుల ప్రస్తుత నైపుణ్య స్థాయిలను అంచనా వేసి పెంచుకోవాల్సిన నైపుణ్యాలపై దృష్టి పెడతారు. ప్రాథమిక అంచనాను బట్టి అభ్యర్థుల తదుపరి మెరుగుపరచుకోవాల్సిన నైపుణ్యాలను సిఫార్సు చేస్తారు.

### ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు

ఒప్పందంలో భాగంగా ఇన్ఫోసిస్ 'స్ప్రింగ్‌బోర్డ్' ప్లాట్‌ఫామ్‌లో క్యూరేటెడ్ లెర్నింగ్ పాత్‌వేస్‌తో ఔత్సాహికులు కనెక్ట్ కావొచ్చు. దీని ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోర్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించి నైపుణ్యాలను అంచనా వేస్తారు. తద్వారా నైపుణ్యాలు, కెరీర్ ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతర నైపుణ్యాభివృద్ధి కోసం ఇన్ఫోసిస్ సాంకేతిక సహకారాన్ని అందిస్తుంది. ఇన్ఫోసిస్ పారదర్శకంగా, డేటా ఆధారిత ఫలితాలను నిర్ధారిస్తూ నైపుణ్య అంచనాల పురోగతి, ఫలితాలను ట్రాక్ చేస్తుంది. రాష్ట్రంలో 15-59 సంవత్సరాల మధ్య వయసుగల 3.59 కోట్ల మంది ఇన్ఫోసిస్ ప్రీ-వాలిడేషన్ ద్వారా శిక్షణ పొందవచ్చు. అంతేకాదు, ఈ ఒప్పందంతో ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం చేపడుతున్న స్కిల్ సెన్సస్ ఫ్రేమ్‌వర్క్, స్కిల్ అప్లికేషన్‌లో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏకీకరణ సులభతరం అవుతుంది. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి హైదరాబాద్ సిద్ధమవుతోంది. వరదలు లేని నగరంగా తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ను అనుసంధానించే రేడియల్ రోడ్లు నిర్మించబోతున్నాం. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం తయారీ రంగానికి కేంద్రంగా ఉండబోతుంది. నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాం. రాష్ట్రానికి తీరప్రాంతం లేదు.. అందుకే డ్రైపోర్టు ఏర్పాటు చేయనున్నాం. పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో కంపెనీలు కలిసి వస్తే అద్భుతాలు సృష్టించవచ్చు" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.పరిశ్రమల స్థాపనకు తెలంగాణ రాష్ట్రం సరైన ఎంపిక ని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.హైదరాబాద్ హైటెక్ సిటీ సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ లో సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రీన్ బిజినెస్ సెంటర్ లో రేవంత్ రెడ్డి మొక్క నాటారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించబోతుందన్నారు. కాలుష్య నివారణకు 3,200 వేల ఈవీ బస్సులు తెచ్చామని, ఈవీ వాహనాలకు రోడ్డు టాక్స్, రిజిస్ట్రేషన్ పన్నులను మినహాయించామన్నారు.గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తూ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామన్నారు. హైదరాబాద్ లో, 55కిలోమీటర్ల మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టామని, 2050ప్రణాళికతో మంచినీటి వసతి ఏర్పాటు చేస్తున్నామన్నారు. 360కిలోమీటర్ల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య రేడియల్ , లింకు రోడ్ల నిర్మాణంజరుగుతుందన్నారు. రింగ్ రైల్వే ప్రతిపాదనల్లో ఉందన్నారు. మెట్రో రైలును విస్తరిస్తున్నామన్నారు. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య పారిశ్రామిక మండళ్లకు మంచి అవకాశముందన్నారు. ఓఆర్ఆర్ ఆవలివైపు గ్రామీణ తెలంగాణ అభివృద్ధికి సంబంధిత పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామన్నారు. చైనా తరహాలో పారిశ్రామిక క్లస్టర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.తెలంగాణ ప్రగతికి డ్రై పోర్టు నిర్మాణానికి యోచిస్తున్నామన్నారు. పారిశ్రామిక వేత్తలు తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని భారీగా పెట్టుబడులు, పరిశ్రమలకు ముందుకురావాలన్నారు. మీ భాగస్వామ్యంతో తెలంగాణ దేశంలోనే పారిశ్రామిక ప్రగతిలో నెంబర్ వన్ గా ఎదగే అవకాశముందన్నారు. తెలంగాణ రైజింగ్ 2050లక్ష్యం దిశగా ముందడుగు వేస్తుందన్నారు.ఈ సందర్భంగా పలువురు పారిశ్రామిక వేత్తలు అడిగిన ప్రశ్నలకు సీఎం రేవంత్ రెడ్డి సమాధానాలిచ్చారు. మహిళాభివృద్ధికి చేపట్టిన చర్యలను, గ్రామీణ ఆర్థిక వనరులు, పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన చర్యలను వివరించారు. లాజిస్టిక్ జోన్ అంశాలపై మాట్లాడారు. రోడ్డు, రైల్వే, ఎయిరో పోర్టు వసతులను వివరించారు. ఆటోమొబైల్ ఇండస్ట్రీల విస్తరణ ఆవశ్యకతలను, ఈ రంగంలో పభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. రాష్ట్రంలో మానవ వనరులు, విద్యా, వృత్తి నిపుణుల లభ్యత, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, ఐటీఐల ఆధునీకరణ అంశాలను పారిశ్రామిక వేత్తలకు విశదీకరించారు. సమావేశంలో సీఐఐ ప్రతినిధులు సంజీవ్ పూరి, ఆర్. ముకుందన్, డీజీ బెనర్జీ లు పాల్గొన్నారు.వరంగల్ మహా నగరంగా ఎదిగేలా విమానాశ్రయానికి రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. వరంగల్ (మామూనూరు) విమానాశ్రయ భూ సేకరణ, ఇతర ప్రణాళికలపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు.దక్షిణ కొరియాతో పాటు పలు దేశాలు తమ పెట్టుబడులకు విమానాశ్రయాన్ని ప్రాధాన్యంగా ఎంచుకుంటున్నాయని, ఆయా దేశాల పెట్టుబడులు ఆకర్షించేలా వరంగల్ విమానాశ్రయం ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కొచ్చి విమానాశ్రయం అన్ని వసతులతో ఉంటుందని.. దానిని పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వరంగల్ అవుటర్ రింగు రోడ్డు, రేడియల్ రోడ్లు విమానాశ్రయానికి అనుసంధానంగా ఉండాలని సీఎం అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల ప్రజలు భవిష్యత్లో వరంగల్ విమానాశ్రయం నుంచే రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలనిఆదేశించారు.

# జాట్లకు మీరు ద్రోహం చేశారు..

మొదటి పేజి తరువాయి

ఆ ఢిల్లీలోని జాట్‌లకు ద్రోహం చేశారంటూ ఆ లేఖలో ఆరోపించారు. బీజేపీ ఓటరు జాబితాను తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అలాగే, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్న బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మపై చర్యలు తీసుకోవాంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి కేజ్రీవాల్ ఫిర్యాదు చేశారు. మరోవైపు.. ఎన్నికల ముందు కేజ్రీవాల్‌కు జాట్లు గుర్తుకొచ్చారా? అంటూ పర్వేశ్ వర్మ విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని జాట్ సామాజిక వర్గం వారిని కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని ప్రధాని మోదీకి రాసిన లేఖలో కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. రెండు పేజీల లేఖలో జాట్లకు సంబంధించి పలు అంశాలను ఆయన పేర్కొన్నారు. 'ఢిల్లీలోని జాట్‌లకు మీరు ద్రోహం చేశారు. ఓబీసీ రిజర్వేషన్ల పేరుతో జాట్ వర్గాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా మోసం చేస్తోంది. 2015 మార్చి 26న జాట్ నాయకులను ఇంటికి పిలిచి ఢిల్లీలోని జాట్‌లను ఓబీసీ జాబితాలో చేర్చుతామని మీరు హామీ ఇచ్చారు. 2019 ఫిబ్రవరి 8న హోం మంత్రి అమిత్ షా కూడా జాట్‌లను కేంద్ర ఓబీసీ జాబితాలోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. రాజస్థాన్‌లోని జాట్ కమ్యూనిటీ విద్యార్థులు ఢిల్లీ వర్సిటీలో రిజర్వేషన్ పొందుతున్నారు. కానీ, ఢిల్లీలోని జాట్‌లకు రిజర్వేషన్లు ఎందుకు లభించడంలేదు? ఢిల్లీలోని జాట్ సామాజిక వర్గానికి చెందిన వేలాది మంది పిల్లలు కేంద్ర ఓబీసీ జాబితాలో లేకపోవడంవల్ల ఢిల్లీ యూనివర్సిటీలో ప్రవేశం పొందలేకపోతున్నారు. ఢిల్లీ ప్రభుత్వం రాష్ట్ర ఓబీసీ జాబితాలో వారు ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో జాట్‌లు ప్రయోజనాలు పొందేందుకు మీ ప్రభుత్వం అనుమతించడం లేదు. మీ ప్రభుత్వ పక్షపాత వైఖరితో ఢిల్లీలోని జాట్‌లతోపాటు. మరో ఐదు సామాజికవర్గాలకు చెందిన వారు విద్యా, ఉపాధి, ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. ఓబీసీ జాబితాలో మార్పులు చేసి ఓబీసీ హోదా ఉన్న ఆయా వర్గాలకు న్యాయం చేయండి. మీ సమాధానం కోసం ఎదురుచూస్తూ ఉంటా'అని లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు. న్యూఢిల్లీ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మపై చర్యలు తీసుకోవాలంటూ ఆమ్ ఆద్మీ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. గురువారం ఢిల్లీ సీఎం ఆతిశీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ సింగ్, ఎంపీ సంజయ్ సింగ్‌లతో కలిసి కేజ్రీవాల్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను కలిసి రెండు పేజీల ఫిర్యాదును అందజేశారు. హర్ ఘర్ నౌకరీ (ఇంటికో ఉద్యోగం) పేరుతో ఓట్లు అడుగుతూ.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న పర్వేశ్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పోటీ చేయకుండా వర్మ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, ఎన్నికల జాబితాలో బీజేపీ అవకతవకలకు పాల్పడుతోందని సీఎం ఆతిశీ మరో ఫిర్యాదు చేశారు. 'నేను పోటీ చేస్తున్న న్యూఢిల్లీ నియోజకవర్గంలో గత 15 రోజుల్లోనే కొత్తగా 13 వేల మంది ఓటర్లు చేరారు. అదేవిధంగా, ఓటర్లను జాబితా నుంచి తొలగించాలని 5,500 దరఖాస్తులు ఈసీకి అందాయి. ఇదో భారీ కుట్ర'అని అనంతరం కేజ్రీవాల్ విలేకరులతో అన్నారు. పరేవ్‌శ్ వర్మ ఇంటిపై తక్షణమే ఎన్నికల నిఘా అధికారులు దాడి చేయాలని డిమాండ్ చేశారు. పర్వేశ్ వర్మ మహిళలకు రూ.1,100 బహిరంగంగానే పంచుతున్నారని ఆరోపించారు. ఓటరు జాబితాలో అవకతవలకు పాల్పడుతున్న స్థానిక ఎలక్టోరల్ అధికారులను సస్పెండ్ చేయాలి లేదా బదిలీ చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు కేజ్రీవాల్‌కు జాట్‌లు గుర్తుకువచ్చారా? అంటూ బీజేపీ అభ్యర్థి పర్వేశ్ వర్మ మండిపడ్డారు. జాట్లను ఓబీసీ జాబితాలో చేర్చాలన్న కేజ్రీవాల్ డిమాండ్‌పై ఆయనకు కౌంటర్ ఇచ్చారు. 'ఈసారి ఢిల్లీలో మా ప్రభుత్వం ఏర్పడుతుంది. జాట్‌ల కోసం కేజ్రీవాల్ ఏమైనా చేసి ఉంటే.. ఎన్నికలకు 25 రోజుల ముందు జాట్‌లు గుర్తుకువచ్చేవారు కాదు. ఢిల్లీలోని గ్రామీణ ప్రాంతాల్లో జాట్‌లు మాత్రమే కాదు.. గుజ్జర్లు, యాదవులు, త్యాగులు, రాజ్‌పుత్‌లు కూడా ఉన్నారు. వీరంతా కేజ్రీవాల్ ప్రభుత్వం పడిపోవాలని కోరుకుంటున్నారు'అని పర్వేశ్ వర్మ అన్నారు.

# అధికార యంత్రాంగం వైఫల్యాన్ని సీఎం ప్రశ్నించారు

మొదటి పేజి తరువాయి

ఒకవైపు తెరవాల్సిన గేట్లు.. మరోవైపు తెరవడంతో తొక్కిసలాట జరిగినట్లు చాలామంది తెలిపారు. సుమారు గంటన్నరపాటు 35 మంది క్షతగాత్రులను సీఎం వ్యక్తిగతంగా కలిశారు. ఏం చేస్తే త్వరగా కోలుకుంటారని వైద్యులను కూడా సీఎం అడిగారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని రూ.25లక్షల చొప్పున సాయం ప్రకటించారు" అని మంత్రి వివరించారు.తిరుపతిలో పద్మావతి పార్కు వద్ద ఉన్న వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ జారీ కేంద్రం వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన దురదృష్టకరమైనదని, ఎంతో బాధాకరమైనదని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఒక మహిళకు షుగర్ లెవల్స్ తగ్గిపోయి పడిపోవడంతో ఆమెను హాస్పిటల్‌కు తరలించేందుకు గేట్ తెరిచారని, అయితే, టోకెన్లు ఇస్తున్నారని భావించిన భక్తులు ఒక్కసారిగా గెట్లమీద పడ్డారని, అందుకే తొక్కిసలాట జరిగిందని మంత్రి వివరించారు.ఒకవైపుగా తెరవాల్సిన గేట్లను మరోవైపు తెరిచారని చెప్పారు. ఘటనా స్థలాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిశీలించారని, అధికారుల వైఫల్యాలను కూడా ఆయన గమనించారని ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. ఇన్‌ఛార్జిగా పెట్టిన డీఎస్పీ ర్యాంక్ పోలీసు అధికారి ఘటన జరిగిన సమయంలో అక్కడ లేకుండా ఎక్కడికో వెళ్లారని వివరించారు. చనిపోయిన ఆరుగురికి వెంటనే పోస్టుమార్టం చేసి అంబులెన్స్‌ల్లో మృతదేహాలను, ప్రత్యేక వాహనాల్లో కుటుంబ సభ్యులను వారి ఇళ్లకు పంపించామని, ఒక రెవెన్యూ అధికారిని కూడా వారి వెంట తోడుగా పంపించామని ఆయన వెల్లడించారు.మృతుల్లో నలుగురు ఏపీకి చెందినవారు కాగా, ఒకరు తమిళనాడు, మరొకరు కేరళకు చెందినవారని మంత్రి తెలిపారు . గాయపడ్డ 35 మందికి రుయా హాస్పిటల్‌లో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం స్విమ్స్ హాస్పిటల్‌కు తరలించారని రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ముగ్గురు మంత్రులతో ఏర్పాటు చేసిన సబ్-కమిటీ ప్రతి బాధితుడిని కలిసి వివరాలను సేకరించిందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దాదాపు ఒకటిన్నర గంట పాటు 35 మంది పేషెంట్లను వ్యక్తిగతంగా పరామర్శించారని, అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల సాయం ఇవ్వాలంటూ సీఎం ఆదేశించారని మంత్రి వివరించారు.మరోవైపు, తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి ఇవాళ (శుక్రవారం) సాయంత్రం 4 గంటలకు అత్యవసర సమావేశం కానుంది. తొక్కిసలాట మృతుల కుటుంబాలకు పరిహారంపై సమావేశంలో తీర్మానం చేయనున్నారు. శనివారం మృతుల స్వస్థలాలకు వెళ్లి చెక్కులు అందజేయడంపై చర్చించనున్నారు.

## పుతిన్ కలవాలనుకుంటున్నారు.. భేటీ ఏర్పాటు చేస్తా

మొదటి పేజి తరువాయి

రష్యా-ఉక్రెయిన్ల మధ్య జరుగుతున్న యుద్ధం వీలైనంత త్వరగా ముగిసేలా చర్యలు తీసుకుంటానని ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో వీరిద్దరి మధ్య భేటీ ప్రాధాన్యం సంతరించుకుందిరష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై ఇప్పటికే ట్రంప్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు పలు మీడియా వర్గాలు వెల్లడించాయి. యుద్ధాన్ని విస్తరించొద్దని పుతిన్‌కు ట్రంప్ సూచించినట్లు పేర్కొన్నాయి. ఈవిషయంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోనూ ఫోన్‌లో మాట్లాడిన ట్రంప్.. యుద్ధం ముగించేందుకు సాయం చేస్తానంటూ భరోసానిచ్చారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో జెలెన్‌స్కీ మాట్లాడుతూ రష్యా దూకుడును అరికట్టడంలో ట్రంప్ నిర్ణయాత్మక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా.. రష్యా ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేస్తుండటం గమనార్హం.2022 ప్రారంభం నుంచి రష్యా- ఉక్రెయిన్ ల మధ్య యుద్ధం నడుస్తోంది. ముగింపుఛాయలు ఎక్కడా కనిపించడం లేదు. యుద్ధం నేపథ్యంలో అమెరికా ఉక్రెయిన్‌కు అండగా నిలిచిన విషయం తెలిసిందే. ఈక్రమంలో అగ్రరాజ్యం 2022 నుంచి కీవ్‌కు ఇప్పటివరకు 62 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను, ఇతర సాయాన్ని అందించింది. దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఇటీవల ఇచ్చిన అనుమతులపై పుతిన్ తీవ్రంగా స్పందించారు. ఇది ఉద్రిక్తతలను మరింత పెంచే నిర్ణయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక దీనికి పరిష్కారం కనుగొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో చర్చలకు మాస్కో సిద్ధంగా ఉందన్నారు. దీంతో ట్రంప్ అధికారాన్ని చేపట్టిన తర్వాత యుద్ధం ఆగుతుందా, లేదా?.. దానికోసం వారు ఏం చేయబోతున్నారు అని ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## నా ఉరిశిక్షను రద్దు చేయండి.. కోర్టుకు ట్విన్ టవర్స్ దాడి మాస్టర్‌మైండ్

మొదటి పేజి తరువాయి

నేతృత్వంలోని అల్ ఖైదా అమెరికాలో 2001, సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని ట్విన్ టవర్స్‌పై దాడి చేసింది. ఈ దాడికి వ్యూహరచన చేసిన ఖలీద్ షేక్ మహమ్మద్ ఉరిశిక్ష నుంచి ఉపశమనం కల్పిస్తూ తనకు క్షమాభిక్ష పెట్టాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారణ జరగకుండా జోబైడెన్ ప్రభుత్వం సఫలమైంది.ముస్లిం దేశాల్లో యుద్ధాలకు అమెరికా, దాని మిత్ర దేశాలే కారణమని ఒసామా బిన్ లాడెన్ నేతృత్వంలోని అల్ ఖైదా అమెరికాలో 9/11 దాడికి పాల్పడింది. ఈ దాడి ఎలా చేయాలి? విమానాల్ని ఎలా హైజాక్ చేయాలి? అనే కుట్రకు ఖలీద్ షేక్ మహమ్మద్ ప్రణాళికలు చేశాడు. మారణ హోమం తర్వాత ఖలీద్‌ను అమెరికా సజీవంగా పట్టుకుంది. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన జైలుగా అభివర్ణించే గ్వాంటనామో బేకు తరలించింది. నాటి నుంచి అదే జైలులో శిక్షను అనుభవిస్తున్నారు.ఈ కేసును గ్వాంటనామో బే కోర్టులో విచారణ కొనసాగుతోంది. విచారణ చేపట్టిన న్యాయస్థానం ఖలీద్‌కు ఉరిశిక్ష విధించింది. అయితే ఆ ఉరిశిక్ష నుంచి తనకు ఉపశమనం కల్పించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ గతేడాది జులై తర్వాత ఇవాళ విచారణకు రావాల్సి ఉంది. అయితే ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టకుండా కేసు దర్యాప్తు చేసేందుకు తమకు మరింత సమయం కావాలని,షెడ్యూల్ ప్రకారం గ్వాంటనామో బే కోర్టులో షెడ్యూల్ ప్రకారం పిటిషన్ చేపట్టకుండా గడువు విధించాలని త్రిసభ్య ధర్మాసనాన్ని కోరారు. అదే సమయంలో ఖలీద్ తరుఫు వాదిస్తున్న న్యాయవాదులు 20 ఏళ్లుగా కేసు విచారణలో అమెరికా మిలటరీ, అమెరికా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని వాదించారు. తన క్లయింట్ ఖలీద్ కోరినట్లుగా ఉరిశిక్ష నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు.ఇరుపక్షాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం.. చివరకు అమెరికా ప్రభుత్వ విజ్ఞప్తిని అంగీకరించింది. ప్రభుత్వ అభ్యర్థనలో వాదనలను పూర్తిగా పరిశీలించినంత కాలం మాత్రమే స్టే కొనసాగుతుందని, తుది తీర్పుగా పరిగణించరాదని నొక్కి చెప్పింది.

## యుద్ధంలో కాదు.. బుద్ధుడిలోనే భవిష్యత్తు

మొదటి పేజి తరువాయి

ఉందని తెలిపారు. గురువారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో 18వ ప్రవాసీ భారతీయ దివస్ వేడుకల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి లాంటిదని, మనందరి జీవితాల్లో ప్రజాస్వామ్యం ఒక అంతర్భాగమని స్పష్టంచేశారు. ప్రపంచ స్థాయిలో మన దేశ ప్రతిష్ట ఎంతగానో పెరిగిందని అన్నారు. కేవలం మన మనోగతమే కాకుండా గ్లోబల్ సౌత్ దేశాల అభిప్రాయాలను సైతం ప్రపంచ వేదికపై బలంగా వినిపించగలుగుతున్నామని వెల్లడించారు. ఆయుధ బలంతో సామ్రాజ్యాలు విస్తరిస్తున్న కాలంలో అశోక చక్రవర్తి శాంతి మార్గంలో నడిచారని గుర్తుచేశారు. మన వారసత్వ బలానికి ఇదొక ప్రతీక అని వెల్లడించారు. యుద్ధంలో కాకుండా బుద్ధుడి బోధనల్లోనే భవిష్యత్తు ఉందని భారత్ నమ్ముతున్నట్లు స్పష్టంచేశారు. ప్రధానమంత్రి మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

### మీ వల్లే తలెత్తుకొని ఉండగలుగుతున్నా..

"ప్రవాస భారతీయులను మన దేశానికి రాయబారులుగా పరిగణిస్తున్నాం. వైవిధ్యం గురించి మనకు ఇంకెవరో చెప్పాల్సిన అవసరం లేదు. వైవిధ్యంపై మన జీవితాలు నడుస్తున్నాయి. భారతీయులు ఎక్కడికి వెళ్లినా అక్కడి సమాజంతో హృదయపూర్వకంగా మమేకమవుతూ ఉంటారు. ఇతర దేశాల నియమ నిబంధనలు మనం చక్కగా గౌరవిస్తాం. మనకు ఉద్యోగం, ఉపాధి కల్పించిన దేశానికి నిజాయితీగా సేవ చేయడం, ఆ దేశ ప్రగతిలో పాలుపంచుకోవడం మనకు అలవాటు. విదేశాల్లో ఉన్నప్పటికీ మన హృదయం భారతీయతతో నిండి ఉంటుంది. భారత్ కోసమే మన గుండె చప్పుడు వినిపిస్తుంది. ప్రవాస భారతీయులు మన దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తున్నారు. వారి వల్లే విదేశాలకు వెళ్లినప్పుడు నేను తలెత్తుకొని ఉండగలుగుతున్నా. మనది యువ భారత్: 1947లో భారత్‌కు స్వాతంత్ర్యం రావడంలో ప్రవాస భారతీయులు కీలక పాత్ర పోషించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్య సాధనకు సహకరించాలని మిమ్మల్ని కోరుతున్నా.

## తిరుపతి తొక్కిసలాట ఘటనపై చంద్రబాబు హైడ్రామా

మొదటి పేజి తరువాయి

తిరుపతి ఎస్పీలపై చర్యలు తీసుకునే ధైర్యం చంద్రబాబుకు లేదని అన్నారు. వైఎస్సార్‌సీపీపై అక్రమ కేసులు బనాయించేందుకే ఈ నలుగురితో కూడిన క్రిమినల్ ముఠాను చంద్రబాబు తిరుమల తిరుపతిలో నియమించుకున్నారని.. ఈ ముఠాకు నాయకుడు చంద్రబాబేనని విమర్శించారు. తొక్కిసలాటకు బాధ్యులుగా కిందిస్థాయి ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం దారుణమని అన్నారు.అంతర్జాతీయంగా తిరుమల తిరుపతి ఆలయానికి గొప్ప గుర్తింపు ఉంది. ఇక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా మొత్తం ప్రపంచం దీనిని గమనిస్తుంది. అటువంటి క్షేత్రంలో ప్రణాళికా లోపం కారణంగా వైకుంఠ ద్వార దర్శనంకు వచ్చిన భక్తులు తొక్కిసలాటకు గురై ఆరుగురు మృతి చెందడం చాలా పెద్ద ఘటనగా భావించాలి. కోట్లాధి మంది శ్రీవారి భక్తుల మనోభావాలకు సంబంధించిన అంశం ఇది. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చాలా సీరియస్‌గా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ సీఎం చంద్రబాబు ఈ ఘటనపై వ్యవహరించిన తీరు అత్యంత అభ్యంతరకరం. డీఎస్పీ, గోశాల డైరెక్టర్ లను సస్పెండ్ చేయడంతో చేతులు దులుపుకున్నారు.

## జగన్ శవరాజకీయాలు మళ్లీ మ్నెదలుపెట్టారు

మొదటి పేజి తరువాయి

మంత్రి సవిత స్పందించారు. తిరుమల వెంకన్న వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం వెళ్లి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ అయ్యారని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మరోవైపు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, సిబ్బందికి సైతం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. వేంకటేశ్వర స్వామివారికి సంబంధించి ఆ పుణ్య క్షేత్రంలో ఎటువంటి తప్పిదాలకూ అవకాశం లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వారిని ఆదేశించినట్లు మంత్రి సవిత చెప్పుకొచ్చారు.

## ప్రాణాలు తీసిన వారిని ఎందుకు కాపాడుతున్నారు?

జిల్లా ఎస్పీ ప్రధాన కారణమని అన్నారు. ప్రజల్లో అగ్రహం రావడంతో... సమాజ మెప్పు కోసం ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా అంగీకరించారని చెప్పారు.టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి పూర్తిగా విఫలమయ్యారనే విషయం పవన్ మాటలతో స్పష్టమయిందని రోజా అన్నారు. కీలక స్థానంలో ఉన్న ప్రధాన అధికారులు, పాలకమండలి వైఫల్యం కారణంగా ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. అందుకు కారణమైన టీటీడీ ఛైర్మన్, ఈఓ, అదనపు ఈఓలపై చర్యలు తీసుకోవాలని పవన్ ఎందుకు అడగరు? అని ప్రశ్నించారు. సమాజంలో ఉన్న అభిప్రాయాన్ని తాను చెప్పడం ద్వారా ప్రజలు మెప్పు పొందటం, చంద్రబాబుకు ఇష్టమైన అధికారులపై చర్యలు కోరకుండా తన రాజకీయ ప్రయోజనాలు కాపాడుకోవడం... ఇదేనా మీ సనాతన ధర్మం? అని పవన్ ను రోజా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేర్వేరుగా వచ్చారంటేనే అర్థం అవుతుంది మీ వ్యూహం ఏమిటో అని వ్యాఖ్యానించారు.

## అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించిన హైడ్రా

నడుమ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నెక్నాంపూర్ చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన నాలుగు విల్లాలను నేలమట్టం చేసిన హైడ్రా సిబ్బంది.. మరికొన్ని విల్లాలను కూల్చివేయడానికి సన్నద్ధమయ్యారు. అయితే నెక్నాంపూర్ చెరువును కబ్జా చేయడంతో గతంలో రెవన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు కూల్చివేశారు. మూడు సార్లు కూల్చివేసినా మళ్లీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు కూల్చివేతలు సాగుతున్నాయి. అలాగే విల్లాలను నిర్మించిన బిల్డర్లపైన హైడ్రా కేసు నమోదు చేసింది. నెక్నాంపూర్ చెరువుపై అక్రమంగా నిర్మించిన దాదాపు 10కి పైగా విల్లాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. గతంలో కూల్చివేతలు చేసినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేయడంపై హైడ్రా అధికారులు సీరియస్ అయ్యారు. అక్రమ నిర్మాణాలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చినటువంటి నేపథ్యంలో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు.ఇందులో భాగంగా ఈరోజు కూల్చివేతలను చేపట్టింది హైడ్రా. దాదాపు నాలుగు విల్లాలను కూల్చివేసిన అధికారులు... మరో పది విల్లాలను కూల్చివేయనున్నట్లు తెలుస్తోంది. నెక్నాంపూర్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఈ నిర్మాణాలు వెలిశాయి. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, రెవన్యూ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఆ తరువాత తిరిగి నిర్మాణాలు వెలిశాయి.

## శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానము







కదిరి పట్టణం (కదిలించే వార్త) జనవరి 10: ముక్కోటి ఏకాదశి పండుగ సందర్భముగా (ఉత్తర ద్వారము దర్శనము) నవ నరసింహుని క్షేత్రములలో కెల్ల భక్త ప్రహ్లాద సమేతముగా స్వయంభూగా వెల(శీయున్న క్షేత్రము శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయము, చారిత్రాత్మకంగా వాసికెక్కిన ప్రశిద్ధిమైన వైష్ణవ క్షేత్రం 10.01.2025 వతేది శుక్రవారము ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పండుగ, వైకుంఠ ద్వారా ( ఉత్తర రాజగోపురము) ఉత్తర ద్వారములో కొలువుదిరిన శ్రీమన్నారాయడు (శ్రీఖాద్రీ నృసిహుడు) శ్రీదేవి భూదేవి సమేతముగా వసంత వల్లభుల స్వామి వార్ల దర్శనార్థము విశేషముగా తరలి వస్తున్న స్వామి వారి భక్తులు.. భక్తులు విశేషముగా రావడముతో ఆలయ విధి, తిరుమాడలలో భక్తుల రద్దిగ మారింది

## వాహనదారులకు ఆర్టీవో కీలక సూచనలు




కదిరి రూరల్ (కదిలించే వార్త) జనవరి 10: శ్రీ సత్య సాయి రోడ్ టాక్స్ కట్టే యజమానులు మీ వాహనానికి సంబంధించిన మండల మ్యాపింగ్ లేదా మీ వాహనం డాక్యుమెంట్లు ట్యాక్స్ గడుపు పది రోజులు ముందే ఈ. కే.వై.సీ తప్పనిసరి చేయించుకోవాలని ఆర్టీవో శ్రీనివాసులు, ఎమ్ .వి. ఐ వరప్రసాద్,ఏ.ఎమ్.వి.ఐ రాజేష్ తెలిపారు. లేకుంటే మీ వాహనం టాక్స్ చెల్లింపులు జరగవు. కావున వాహనదారులందరూ గమనించి ముందే జాగ్రత్త పడాలని కోరారు.

## పల్లె పండుగ కార్యక్రమం విజయవంతం.

**వేంపల్లి లో సిమెంట్ రోడ్డు కు శంకుస్థాపన చేసిన మారెడ్డీ రవీంద్రనాథ్ రెడ్డి**



వేంపల్లి (కదిలించే వార్త) జనవరి 10: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా వేంపల్లి ఇమామ్ నగర్ లో ఏడు లక్షల యాభై వేల రూపాయల తో సిమెంట్ రోడ్డు నిర్మాణం కు పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ మారెడ్డీ రవీంద్రనాథ్ రెడ్డి శంకుస్థాపన చేసారు.కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత వేంపల్లి పట్టణం లో 70 లక్షల 50 వెల రూపాయలు సిమెంట్ రోడ్ల నిర్మాణం కు నిధులు కేటాయించడం జరిగిందని బీటెక్ రవి అన్నారు.12 చోట్ల సిమెంట్ రోడ్లు మంజూరు అవ్వగా ఇప్పటికే 11 వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి అయినట్లు ఆయన తెలిపారు కూటమి సంక్షేమం అభివృద్ధి సమపాల్లుగా ముందుకు తీసుకువెళుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల ఇన్చార్జ్ అంజుగట్టు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రామ మునిరెడ్డి, టిడిపి నాయకులు షబ్బీర్ వలి, లోమడ భాస్కర్ రెడ్డి, తెలంగాణ వలి, అలలపాడు బాలస్వామి రెడ్డి భద్ర శేషారెడ్డి మల్లికార్జున కార్యకర్తలు పాల్గొన్నారు

## మహిళాలతో కళకళలాడిన దేవాలయాలు







వేంపల్లె (కదిలించే వార్త) జనవరి 10: వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేవాలయాలు మహిళాలతో కళకళలాడినాయి. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వేంపల్లెలోని శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన ఎద్దుల కొండపై, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల కోసం సర్వ దర్శనానికి ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయాల్లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు ఎద్దుల కొండపైకి వెళ్లేందుకు ఆలయ అధికారులు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో మహిళా, పిల్లలు భారీ సంఖ్యలో ఆలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సర్వ దర్శనం గూండా వెళ్లి శ్రీ వెంకటేశ్వర స్వామికి పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

## భారీగా అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

**- 183 రేషన్ బస్తాలు, ఐచర్ వాహనం స్వాధీనం**



వేంపల్లె (కదిలించే వార్త) జనవరి 10: మండలంలోని టీ వెలమ వారి పల్లి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్ఫోర్స్మెంట్ సీఐలు నారాయణ, శివన్న లు పట్టుకున్నారు. గురువారం ఎన్ఫోర్స్మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు ఆదేశాల మేరకు వారు ఎస్సై రంగారావు, డి.టి సుధీర్ లతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు టీ.వేలమ వారిపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా 183 రేషన్ బస్తాలను ఐచర్ వాహనంలో తీసుకెళ్తుండగా వాటిని గుర్తించి డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం రేషన్ బియ్యాన్ని వేంపల్లిలోని పౌరసరఫరాల శాఖ గౌడన్ కు తరలించామన్నారు. వేంపల్లి చుట్టూ ప్రాంతాల ప్రజల నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. ఇవి అనంతపురం జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులుగా గుర్తించామన్నారు. ఐచర్ వాహన డ్రైవర్ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. దీనిపైన పూర్తి విచారణ జరిపి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వారిని చట్టపరంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ హరినాథ్ రెడ్డి, ఆర్ఐ లోకేష్, వీఆర్వోలు ఓబయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



## భక్తులందరికీ వైకుంఠ ద్వార దర్శనం

**పలు ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తజనం**



వేంపల్లె (కదిలించే వార్త) జనవరి 10: స్థానిక పాపాగ్ని నది ఒడ్డున ఉన్న ఎద్దుల కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ వృషభ చలేశ్వర స్వామి దేవస్థానం, నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, మెయిన్ బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో భక్తులకు వైకుంఠ ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయం నాలుగు గంటలకే మహిళలు భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్తర ద్వారం గుండా వెళ్లి వృషభ చలేశ్వరుని, వెంకటేశ్వర స్వామి, వాసవి కన్యకా పరమేశ్వరుని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రవీణ్,వృషభాషలేశ్వర స్వామి, వాసవి కన్యకా పరమేశ్వరుని విశేష అలంకరణ చేసి అభిషేకాలు, కుంకుమార్చనలు తదితర పూజారి కార్యక్రమాలు నిర్వహించారు. పులివెందుల ఇంచార్జి బీటెక్ రవి మండల కన్వీనర్ రామముని రెడ్డి వేంపల్లి మండల ఇన్చార్జి రఘునాథ్ రెడ్డి జడ్పిటిసి రవికుమార్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులందరికీ తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో వృషభ చలేశ్వర భక్త బృందం వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే కన్యకా పరమేశ్వరి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, దాసి రెడ్డి, రంగ ప్రసాద్, లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర హెూంమంత్రి అమిత్ క్షమాపణలు చెప్పాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్ రెడ్డి**

శింగనమల..(కదిలించే వార్త) జనవరి 10: పార్లమెంటులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వెంటనే ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. అమిత్ వ్యాఖ్యల ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా స్థానిక ఆర్అండ్బి బంగ్లా వద్ద నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధి కోసం తన జీవితాన్నే ఫణంగా పెట్టి దేశానికి మహెూన్నతమైన రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ను కించపరిచే విధంగా మాట్లాడటం దౌర్భాగ్యమన్నారు. అలాంటి గొప్ప వ్యక్తిని కేవలం స్వార్థ రాజకీయాలు, మత రాజకీయాలు పెంపొందించుకోవడానికి ఇష్టానుసారంగా మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. ప్రజాస్వామ్య విధానాలను కాలరాస్తూ ఆర్ఎస్ఎస్ విధానాలను దేశ ప్రజలపై బలవంతంగా రుద్దే విధంగా ప్రయత్నాలు చేస్తున్న బిజెపిని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల శివప్రసాద్, జిల్లా కార్యదర్శి సోనియా సీనా, మైనార్టీ వింగ్ రాష్ట్ర నాయకులు అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

**శింగనమల : అంబేద్కర్పై అనుచిత**

వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూంమంత్రి అమిత్ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవికి రాజీనామా చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఒబిసి చైర్మన్ రామ్చరణ్యదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెష్ పార్టీ ఒబిసి జిల్లి నాయకులు బండి రామాం జనేయులు, బుక్కరాయసముద్రం కన్వీనర్ మాడిశెట్టి సురేష్, మైనార్టీ నాయకులు రఫీ, రాజు కురువ, గట్టునాయక్, రుషింగన్న, కృష్ణారెడ్డి, చిన్న కమ్మన్న, శివశంకర్ యాదవ్, పాల్గొన్నారు.

## అజంజాహి మిల్లు భూములను కాపాడలని కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు






వరంగల్ (కదిలించే వార్త) జనవరి 10: వరంగల్ నగరంలోని కాశీబుగ్గ వేంకటరామ జంక్షన్ లక్ష్మిపురంలో ఆజంజాహి మిల్లు భూములపై జ్యుడీషియల్ విచారణ జరిపించి భూములను కాపాడాలని కోరుతూ వరంగల్ కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ కారుల ఆకాంక్షల వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు, ఈ సందర్భంగా ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ గోధుమల కుమారస్వామి మాట్లాడుతూ తెలంగాణ కే తలమానికమైన అజాంజాహి మిల్లును 1991 నుండి నిర్వీర్యం చేస్తూ రాజకీయ కుట్రలకు బలిచేసి, 2002 లో పూర్తి గా లాక్ ఔట్ చేసి, మిల్లులో పని చేస్తున్న కార్మిక కుటుంబాలను రోడ్డున పడేసి, వారి ఆత్మహత్యలకు కారణమైన గత ప్రభుత్వాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కార్మికుల పట్ల మొసలి కన్నీరు కారుస్తూ మిల్లు భూములపై కన్నేసి బినామీ పేర్లతో కబ్జాలు చేసాయనీ, మిల్లుకు సంబంధించిన 227 ఎకరాల భూములలో కుడా 117 ఎకరాలు హౌసింగ్ సొసైటీ వారికి 65 ఎకరాలు, రాంకీ వారికి 30 ఎకరాలు అమ్మినట్లుగా ప్రచారంలో ఉన్నది. మిగిలిన భూమి ఎక్కడ ఉన్నదో అధికారులు ఇప్పటి వరకు నిర్ధారించలేదు, మిగులు భూమిని కబ్జాదారులు కాజేసారని ప్రజలలో చర్చ జరుగుతున్నది, అట్టి మిగులు భూములను జ్యుడీషియల్ విచారణ జరిపించి, కార్మిక యూనియన్ భవనాన్ని ఆక్రమించు కోవడానికి నకిలీ దస్తావేజులు సృష్టించి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాని కోరుతూ సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసి, మిల్లు భూములలో కార్మికులకు నివాస స్థలాలను కేటాయించి, ప్రభుత్వ నిజాయితీని నిరూపించుకోవాలని ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక వివిధ ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని కోరారు. ఇట్టి కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్, సీ.పీ.యూ.ఎస్.ఐ జిల్లా కార్యదర్శి గడ్డం శరత్, మహాత్మ జనాధికార సమితి అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షల వేదిక నాయకులు నవరత్న ఆనంద్, ఐతం నగేష్, గోపనబోయిన రాజు, రఘు, ఎండీ హాజీ, గౌస్, షేక్ బాబు, బరిగెల కృష్ణ, దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసు సురేష్ వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ కృష్ణానందగిరి ఆశ్రమం కొత్తపల్లిగోరి లో ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు





రేగొండ (కదిలించే వార్త) జనవరి 10: ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ కృష్ణానందగిరి స్వామి ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు స్వామికి ఘనంగా పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో భాగంగా ఉదయం 4:00 గంటలకు సీతారామచంద్ర స్వామికి అభిషేకం పూజా కార్యక్రమాలతో పాటుగా సంపూర్ణ భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణానందగిరి స్వామీ మాట్లాడుతూ ముక్కోటి వైకుంఠ ఏకాదశిని హిందువులు ఆచరించే అత్యంత పవిత్రమైన ఏకాదశి , ఈ రోజున వైకుంఠ ద్వారం లేదా స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయని నమ్ముతారు కాబట్టి ఈ వైకుంఠ ఏకాదశి హిందువులకు అత్యంత పవిత్రమైనదని శేషతల్పం మీద శయనించే విష్ణుమూర్తిని దర్శించుకోడానికి వైకుంఠానికి తరలివెళ్లే ముక్కోటి దేవతలతో కలిసి స్వామి భూలోకానికి వచ్చే శుభ సందర్భం కనుక వైకుంఠ ఏకాదశిని పరమ పవిత్రమైన ఈ రోజున ఉత్తర ద్వార దర్శనంతో స్వామిని దర్శించుకుంటే జన్మ జన్మల పాపాలు తొలగిపోయి పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయని ఈ రోజు మహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగివచ్చి భక్తులకు దర్శనమిస్తాడు కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అనే పేరు వచ్చిందంటారు. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సరి సమానమైన పవిత్రతను సంతరించుకున్నందువల్ల దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని ముక్కోటి ఏకాదశి నాడే హాలాహలం , అమృతం రెండూ పుట్టాయని ఈ రోజునే శివుడు హాలాహలం మింగాడని మహాభారత యుద్ధంలో భగవద్గీతను కృష్ణుడు అర్జునునికి ఇదే రోజున ఉపదేశించాడని ముల్లోకాలను నడిపించే విష్ణుమూర్తిని ముక్కోటి ఏకాదశిన స్తుతించే వారికి మోక్షం ప్రాప్తిస్తుందని ముక్కోటి ఏకాదశి నాడు చేసే విష్ణు పూజ , గీతా పారాయణం , గోవింద నామ స్మరణం , పురాణ శ్రవణం మోక్ష ప్రాప్తి కలిగిస్తాయని ప్రధాన పర్వదినాల్లో వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి చాలా ప్రముఖమైనదని మన శరీరంలో ఆరుచక్రాలు ఉంటాయి. మనలో ఉన్న కుండలిని శక్తిని జాగృతం చేసి , మూలాధార చక్రం నుండి స్వాధిష్టాన , మణిపూరక , అనహత , విశుద్ధి , ఆజ్ఞ చక్రాలను దాటుకుంటూ ఏడవదైన సహస్రార చక్రంలో సహస్రకమలంలో పరమాత్మను దర్శించి , బ్రహ్మరంధ్రం ద్వారా జీవాత్మను సచ్చిదానంద రూపమైన పరమాత్మలో ఐక్యం చేయడం. అటువంటి వారికి ఇక ఉత్తర జన్మ(మరుజన్మ) ఉండదని ఈ సందర్భంగా కృష్ణా నందగిరి స్వామీ భక్తులకు తెలియజేశారు.

## విద్య రంగ సమస్యలను పట్టించుకోని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి

- మంద శ్రీకాంత్ ఎస్.ఎఫ్.ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి.

-తక్షణమే రాష్ట్రానికి విద్యశాఖ మంత్రిని నియమించాలి.

-ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు నిరసన.




హనుమకొండ (కదిలించే వార్త) జనవరి 10: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదని ఎస్.ఎఫ్.ఐ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ లు నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు అనేకమైన సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించడం లేదన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న కూడా ఇప్పటివరకు రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 7200 కోట్ల దాకా స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ పెండింగ్లో ఉన్నాయన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు లేక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్నారు అంతే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలకు సొంత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ తీవ్రమైన ఇబ్బందులు పడుతు న్నారన్నారు ప్రభుత్వం అధికారులు రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమ య్యారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి, అధికారులు స్పందించి రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు లేదంటే పెద్ద ఎత్తున ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ నాయకులు గణేష్, అజయ్, రాహుల్, మల్లేష్, సందీప్, ప్రణయ్,రాజ్ కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అజంజాహీ మిల్ కార్మిక భవన పరిరక్షణ కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ



వరంగల్ (కదిలించే వార్త) జనవరి 10: వరంగల్ లోని అజంజాహీ మిల్ కార్మిక భవన పరిరక్షణ కోసం శుక్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కాశిబుగ్గ వెంకట్రామ జంక్షన్ లక్ష్మి పురంలో లక్ష సంతకాల సేకరణ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో ప్రదీప్ రావు మాట్లాడుతూ స్థానిక మంత్రి భర్త ఇదే కార్మిక భవన స్థలాన్ని ఒక బడా వ్యాపారవేత్త నిర్మించనున్న కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న విషయం అందరికీ తెలిసిందే. అప్పుడు వరంగల్ భారతీయ జనతా పార్టీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు అందరూ కలిసి ఆ యొక్క పనులను అడ్డుకున్నప్పుడు కొండా మురళి అది కమర్షియల్ కాంప్లెక్స్ కడుతున్నారన్న విషయం తెలవదు, కార్మికుల కోసం నేను ఎల్లవేళలా శ్రమిస్తా వారికోసం నా సొంత డబ్బులతో భవనం నిర్మి స్తానన్నాడు. అప్పుడు అందరం స్వాగతిచ్చాం. కానీ ఇప్పటికీ ఏ ఒక్క పనులు ప్రారంభం కాగా అదే బడా వ్యాపారవేత్తకు సలహాలు సూచనలు అందిస్తూ హైకోర్టు నుండి స్టే తెచ్చుకునే విధంగా అధికార అహంతో వారికి సలహాలు ఇస్తున్న విషయం తెలిసి నేడు అఖిలపక్ష ఆధ్వర్యంలో చేపట్టిన లక్ష సంతకాలు సేకరించి అదే హైకోర్టు వరకు భారతీయ జనతా పార్టీ కార్మికులతో కలిసి కార్మికులకు చెందే విధంగా పోరాడుదాం అన్నారు. ఇట్టి కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వరరావు మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్, మాజీ శాసనసభ్యుడు కొండేటి శ్రీధర్, కార్మిక భవన పరిరక్షణ కమిటీ సభ్యులు ఆకెన వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల లక్ష్మణ్, డాక్టర్ కొణతం కృష్ణ, గంగుల దయాకర్, గంజి సాంబయ్య మాటేటి అశోక్ కుమార్, బిజెపి ముఖ్య నాయకులు కార్మికులు కార్మిక కుటుంబ సభ్యులు స్థానికులు పాల్గొన్నారు.



## పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలు




వేంపల్లె (కదిలించే వార్త) జనవరి 10: పండుగలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని వేంపల్లి వికాస్ స్కూల్ కరెస్పాండెంట్ రఫీయా పేర్కొన్నారు. శుక్రవారం ఆ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగలు వారసత్వ సంప్రదాయాలని బంధాలను, బంధుత్వాలను కాపాడుకోవాల్సిన బాధ్యత పిల్లలపై ఉందని తెలిపారు. విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగ వాతావరనాన్ని నెలకొల్పారు. చిన్న పిల్లల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నజీర్ భాష, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరో కిడ్స్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు





పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రోడ్డు లో ఉన్నటువంటి యూరో కిడ్స్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను చిన్నారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో చిన్నారులచే రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో చిన్నారులు తెలుగు సంస్కృతిని ప్రతిబింబిస్తూ ,హరిదాసు వేషధారణలు , సాంప్రదాయ దుస్తులు పలు రకాల ఆటల పోటీలు, డాన్సులు, బొమ్మల కొలువు రంగవల్లి కళ, గొబ్బెమ్మల అందంగా అలంకరించి చిన్నారులు అందరిని ఆకట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ మన తెలుగు పండగల సంస్కృతి సాంప్రదాయాల గురించి చిన్నారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో
# ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు
### యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద - ఆర్.డి.ఓ నారాయణ



పరకాల (కదిలించే వార్త) జనవరి 10:యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని ఆర్డీవో డాక్టర్ కే నారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేటు వద్ద సిటిజన్ ఫోరం కన్వీనర్ డాక్టర్ నాగబండి విద్యాసాగర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవితము సమాజంలో యువత పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన వక్తగా సౌమిత్రి లక్ష్మణ చారి మాట్లాడుతూ యువతకు స్ఫూర్తి స్వామి వివేకానంద అని అన్నారు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. నీలోనే శక్తి దాగి ఉంది నీవు ఏదైనా సాధించొచ్చు అంటూ యువతలో ప్రేరణ నింపి యువతకు రోల్ మోడల్ గా నిలిచిన గొప్ప వ్యక్తి వివేకానంద అని కొనియాడారు. నేటి సమాజంలో యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. అనంతరం సి.ఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ తన ఉపన్యాసాలతో ప్రపంచాన్ని ఉర్రూత లూగించిన స్వామి వివేకానంద మహోన్నత వ్యక్తి అని ఆయన గురువైన రామకృష్ణ పరమహంస పేరుతో రామకృష్ణ మఠాన్ని స్థాపించి ఎన్నో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం జరిగినదని అన్నారు. సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నేషనల్ యూత్ డే నిర్వహించడం అభినందనీయమని విద్యార్థులు స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని తమ లక్ష్యాలను సాధించే వరకు విశ్రమించద్దని ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యాన్ని చేరుకునే వరకు నిరంతరం చదువుపై శ్రద్ధ చూపి జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పేర్కొన్నారు. అనంతరం పురపాలక సంఘం చైర్మన్ అనిత రామకృష్ణ , మున్సిపల్ కమిషనర్ సుష్మ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆశయాలను చిన్నప్పటినుండే అలవర్చుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఇట్టి కార్యక్రమంలో వైస్ చైర్మన్ రేవూరి విజయ పాల్ రెడ్డి , సిటిజన్ ఫోరం కమిటీ సభ్యులు ఆర్పి జయంత్ లాల్ , బండి సారంగపాణి , గందే వెంకన్న, చోలేటి సునందర్, వీరేష్ రావు బెజ్జంకి కరుణాకర్, పాలకుర్తి తిరుపతి, పున్నం అశోక్ తదితరులు పాల్గొన్నారు.





# బండలాగుడు పోటీల విజేత చౌటిపల్లి ఎద్దులు



పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల మండల పరిధిలోని ఉలిమెళ్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో చౌటిపల్లికి చెందిన చంద్ర కోడె ఎద్దులు ప్రథమ బహుమతిని సాధించాయి. ముక్కోటి ఏకాదశి మహోత్సవం సందర్భంగా పులిమెల్ల గ్రామ సమీపంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో గ్రామస్తులు నిర్వహించిన బండ లాగుడు పోటీలో పది గాండ్లు పాల్గొన్నాయి. వైఎస్ఆర్ సీపీ మున్సిపల్ ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి ఎద్దుల పోటీలను ప్రారంభించారు.ఇందులో చౌటిపల్లి గ్రామానికి చెందిన చంద్ర కోడెలు 3524.4 అడుగులు లాగి ప్రథమ బహుమతిని,ఎంపీఎస్ ఆర్ బుల్స్ 3084.5 అడుగులు లాగి ద్వితీయ బహుమతిని,వేంపల్లి గ్రామానికి చెందిన రమణయ్య కోడలు 3004.8 ఆగులు లాగి తృతీయ బహుమతిని , రాజువారి పేట కు చెందిన శ్రీకాంత్ రెడ్డి కోడెలు 2730 అడుగులు లాగి నాలుగవ బహుమతిని ,వరదాయపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు కోడెలు 2688.3 అడుగులు లాగి ఐదవ బహుమతిని పొందాయి.మొదటి బహుమతిని పొందిన చంద్ర కు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు మీదుగా 50 వేల నగదును గ్రామస్తులు కె గోపాల్ రెడ్డి,గజ్జల వెంకట సుబ్బారెడ్డి, బి జనార్దన్ రెడ్డి, ఏ శ్రీనివాస రెడ్డిలు అందించారు.రెండవ బహుమతి 40 వేలు ,మూడవ బహుమతి 30 వేలు నాల్గవ బహుమతి 20 వేలు,ఐదవ బహుమతి 10 వేలు నగదును గ్రామస్తులు విజేతలకు అందచేశారు.ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామస్తులు మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నిర్వాహకులు గోపాల్ రెడ్డి,వెంకట సుబ్బారెడ్డి, జనార్దన్ రెడ్డి,శ్రీనివాస రెడ్డి,సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన జాతీయ సేవా పథకం కార్యక్రమాలు



పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల లోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలకు చెందిన నాల్గవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు "జాతీయ సేవా పథకం" లో భాగంగా ఏడు రోజుల పాటు అనగా 04 జనవరి నుండి 10 జనవరి వరకు పులివెందుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఘనంగా ముగిసింది. చివరి రోజు అయిన ఏడొవ రోజు మధ్యాహ్నం గ్రామంలో ఏడు రోజుల జాతీయ సేవా పథకం యొక్క "ప్రత్యేక శిబిరం ముగింపు కార్యక్రమం" శుక్రవారం నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివెందుల అరటి పరిశోధనా కేంద్రం అధిపతి ప్రొఫెసర్ డాక్టర్. వి.ఎన్.పి. శివరామ కృష్ణ విచ్చేసారు. ఈ కార్యక్రమం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎమ్. మాధవ అధ్యక్షతన జరిగింది. కళాశాల జాతియ సేవా పథకం అధికారి డాక్టర్. నివేదిత ఈ ఏడు రోజుల కార్యక్రమాలను గురించి సభలో సంక్షిప్త నివేదికగా వివరించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ శివరామ కృష్ణ ఎన్.ఎస్.ఎస్ విద్యా వాలంటీర్లను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ విద్యార్థులు తమ సొంత ఎదుగుదలతో పాటు సమాజానికి కూడా సేవ చేయాలని తెలిపి ఇటువంటి జాతీయ సేవా పథకం కార్యక్రమాలు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి అని పేర్కొన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ ఈ ఏడు రోజుల కార్యక్రమం విజయవంతం చేసినందుకు గ్రామస్థులకు, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు. కొందరు గ్రామస్థులు మాట్లాడుతూ ప్రత్యేక శిబిర కార్యక్రమాలు బాగా చేసారని, ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు తమను ఎంతో ఆప్యాయంగా రోజు పలకరించేవారని సభలో తమ అభిప్రాయాలు తెలిపారు. ముగింపు రోజు ఉదయం గ్రామం నందు పరిసరాల పరిశుభ్రతకు సంబంధించి, గ్రామ పరిధిలో క్రిమి సంహారక చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పొడిని వేసి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో మరియు గ్రామ మూడు రోడ్ల కూడలి యందు "సిమెంట్ చెత్తకుండీలు ఏర్పాటు" చేసి, ఆ చెత్తకుండీలకు నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు తెల్ల పెయింట్ వేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహవంతులైన గ్రామస్థులు, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, జాతియ సేవా పథకము కార్యక్రమ అధికారులు డాక్టర్. జయమ్మ మరియు డాక్టర్ నివేదిత, అధ్యాపకులు ఇంజినీర్ నజ్మా, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ జాకిర్ బాషా, ఎన్.వి. సుబ్బారెడ్డి, నాల్గొవ సంవత్సర ఎన్.ఎస్.ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు



సింహాద్రిపురం (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయస్థవాన స్వామివారికి పంచామృతాభిషేకం సహస్రనామార్చన తదితర కైకరియా పూజా కార్యక్రమాల అనంతరం ప్రత్యేక అలంకారంలో వెంకన్న భక్తులకు దర్శనాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉభయదారులు గజ్జల అమరనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులచే స్వామివారికి పట్టు వస్త్రాలను పూర్ణకుంభం మేల వాయిద్యాలతో తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు.అనంతరం గోవింద నామాల 500 పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకుంటూ గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. వాటిలో భాగంగా సాయంకాల సమయాన స్వామివారి ప్రత్యేక రథంలో ప్రత్యేక అలంకారంలో పద్మావతి వెంకటేశ్వరుడు గ్రామోత్సవ కార్యక్రమాలు మేలవాయిద్యాల మధ్య పురవీధుల గుండా భక్తులకు దర్శనమివ్వగా భక్తులు స్వామి వారికి కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి శ్రీ కంబగిరి లక్ష్మీనారాయణ సునీత దంపతులు శ్రీగంధం గంగరాజు లక్ష్మీదేవి , ఆర్ఎంపి నారాయణ మరియు భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీ రంగనాథుని కళ్యాణం

### శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో పోటెత్తిన భక్త జనం
### స్వామివారిని దర్శించుకున్న జూనియర్ సివిల్ జడ్జి





పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల వెలసిన శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి పల్లి కృష్ణరాజ్యశర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామివారికి అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు ఉదయం 3 గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి తరలివచ్చారు. పురాణ ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథ స్వామి ఆలయం కావడంతో తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. స్వామి వారిని పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి ,ఈవో వెంకటరమణలు ఆలయ మర్యాదలతో జడ్జి చంద్రశేఖర్ రెడ్డికి ఆహ్వానం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మాజీ ఎంపీ ,జడ్పీ చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి తన కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారిని సేవించుకున్నారు. పులివెందుల మున్సిపల్ కమిషనర్ రాముడు, పట్టణ సీఐ నరసింహులు, శ్రీ అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు, టిడిపి నేతలు బ్రాహ్మణపల్లి వెంకటరామిరెడ్డి, వీరభద్రారెడ్డి కుటుంబ సభ్యులు, శ్రీ లక్ష్మీ దేవస్థానం ఆలయ అధ్యక్షులు తూగుట్ల రామచంద్రారెడ్డి ,ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి ఉమాదేవి ,శ్రీ రంగనాథ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ లు ఒనిడా సుబ్బారెడ్డి,ఉన్నతి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు రామనాథ యాదవ్, రమణ ,వైసిపి నేత హాల్ గంగాధర్ రెడ్డి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రామమోహన్, కళ్యాణోత్సవ ఉభయ దారులు గుప్తా మెడికల్ స్టోర్ అధినేత మేడందినేష్ కుమార్ , మేడం వంశీ యులు, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు, చల్లా వంశీయులు చంద్రశేఖర్, నారాయణస్వామి, ఎస్ టి యు ఉపాధ్యాయ సంఘ నేత అంగడి నాగేంద్ర, ఎర్రిపల్లె నారాయణ తదితరులు దర్శించుకున్నారు. ఎర్రిపల్లి నారాయణ కుటుంబం స్వామివారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

### .ఘనంగా శ్రీ రంగనాథ స్వామి కళ్యాణం.

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ రంగనాథ స్వామి శ్రీదేవి భూదేవిల వివాహం అత్యంత ఘనంగా నిర్వహించారు. శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో ఉదయం కళ్యాణం ఉత్సవ ఉభయదారులు దినేష్ మెడికల్ స్టోర్ అధినేత మేడం దినేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రామ్మోహన్ తదితర్ల పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. అనంతరం మేడం వంశీయుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### పురవీధుల్లో స్వామి ఊరేగింపు.

ముక్కోటి ఏకాదశినీ పురస్కరించుకుని పులివెందుల పట్టణ వీధుల్లో గరుడ వాహనంపై శ్రీరంగనాథ స్వామి శ్రీదేవి భూదేవిల సమేతంగా ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని పూలంగల్ల సర్కిల్ నుంచి శ్రీనివాస హాల్ రోడ్డు, ముత్యాల వారి వీధి, శ్రీకృష్ణదేవరాయ నగర్, అమ్మవారి శాలల మీదుగా ఈ ఊరేగింపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైకుంఠ ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
### గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయాలు



పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందుల పట్టణ పరిధిలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్క రించుకుని శ్రీ పద్మావతి వెంకట రమణ స్వామి ,శ్రీ రంగనాథ స్వామి , వాసవి కాలనీలో కొలువై ఉన్న నరసింహస్వామి ఆలయంలో మరియు పలు వైష్ణవ ఆలయాలలో వైకుంఠ ద్వార దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణాలు గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ముక్కోటి ఏకాదశి పర్వదినాన ఉదయాస్తమాన వైష్ణవ ఆలయాలలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామివారు దర్శనమివ్వగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా ముక్కోటి ఏకాదశి పర్వదినాన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా భక్తులు స్వామివారిని దర్శించుకుని విధంగా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని, స్వామివారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి కలగాలని కోరుకోవడం జరుగుతుందని తెలియజేస్తూ ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.



# లింగ నిర్ధారణ పనులు నిర్వహిస్తే శిక్షార్హులు అవుతారు



సింహాద్రిపురం (కదిలించే వార్త) జనవరి 10: ప్రాథమిక ఆరోగ్య గ్ కేంద్రము కోవరం గుట్టపల్లి నందు డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో రమణమ్మ డిప్యూటీ డెమో మాట్లాడుతూ పి సి -పీ ఎన్ డి టి యాక్ట్ గర్భస్థపూర్వ మరియు పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం గురించి తెలిపారు మరియు గర్భిణీ స్త్రీ హాస్పిటల్ కి వెళ్లి స్కాన్ చేయించు కునేటప్పుడు డాక్టర్లను ఆడ మగ గురించి అడగరాదని అలా అడిగిన ఎడల అడిగినవారికి మరియు చెప్పిన వారికి మొదటిసారి శిక్షకు 10000 రూపాయలు జరినామా మూడు సంవత్సరములు జైలు ,రెండవసారి చెప్పిన యెడల 50 వేల రూపాయల జరినామా ఐదు సంవత్సరములు జైలు పడునని అంతేకాక హాస్పిటల్ మూసివేయడం జరుగుతుందని తెలిపారు ప్రతి ఒక్క ఆశ వారి పరిధిలోని గ్రామాల్లో ఒక్క ఆడబిడ్డ కలిగి గర్భము దాల్చిన స్త్రీల వివరాలు నమోదు చేసుకుని, వాళ్లు స్కాన్ సెంటర్ కి ఎక్కడికి పోతున్నారు మరియు వాళ్లు అబార్షన్స్ ఎక్కడ చేయించుకుంటున్నారు వాళ్ల వివరములు డాక్యుమెంటేషన్ చేయవలెనని తెలిపారు, గర్భస్థపూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టం( పి సి-పి ఎన్ డి టి 1994 గురించి తెలుపుతూ ఈ చట్ట ప్రకారము ఏ గర్భిణీ స్త్రీ అయినా హాస్పిటల్ కి వెళ్లి స్కాన్ చేయించుకునేటప్పుడు డాక్టర్లను ఆడ ,మగ గురించి అడగరాదని అలా అడిగిన ఎడల అడిగినవారికి చెప్పినవారికి శిక్ష పడునని తెలిపారు, అలా తెలిపిన స్కాన్ సెంటర్ యాజమాన్యానికి మొదటిసారి తప్పిదముగా పదివేల రూపాయలు జరినామా మూడు సంవత్సరములు జైలు, రెండవ సారి చెప్పిన ఎడల 50 వేల రూపాయల జరినామా ఐదు సంవత్సరములు జైలు పడునని అంతేకాక హాస్పిటల్ మూసివేయడం జరుగుతుందని తెలిపారు . ఈ మధ్యకాలంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుతున్నందువలన జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్స్, పోలీస్ డిపార్ట్మెంట్, ఐసిడిఎస్ డిపార్ట్మెంటు కలిసి స్కాన్ సెంటర్స్ ను ఇన్స్పెక్షన్ చేస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

# కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఎంపీ రవిచంద్ర
### వైకుంఠ ఏకాదశి సందర్భంగా కుటుంబ సమేతంగా దర్శనం.



వరంగల్ (కదిలించే వార్త) జనవరి 10: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ లు తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి తిరుపతిలో శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) సందర్భంగా ఎంపీ రవిచంద్ర-విజయలక్ష్మీ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కమలాకర్ -రజిత,వద్దిరాజు వెంకటేశ్వర్లు - ఉమామహేశ్వరి, శీలం సత్యనారాయణ - లక్ష్మీ, గంగుల సందీప్ - డాక్టర్ గంగాభవాని, వద్దిరాజు నిఖిల్ చంద్ర - అనీల, వద్దిరాజు నాగరాజు - డాక్టర్ అర్చిత, రౌతు కనకయ్య -సుధారాణి, మరికల్ పోత సుధీర్ కుమార్ - సమంత దంపతులు కలియుగ ఇష్ట దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ఉత్తర ద్వారా దర్శనం చేసుకుని తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఊసారఘు, కూసం శ్రీనివాసులు, నర్సింహారావు నాగసాయి రాజశేఖర్, గొల్లమూడి కిరణ్, వద్దిరాజు ప్రీతమ్, వద్దిరాజు గిరినందన్, వలసాల అస్మిత, గంగుల సనవ్, గంగుల సౌరవ్, వద్దిరాజు సహశ్రిక, వద్దిరాజు సమర్థ్ తదితరులు శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్యే కమలాకర్,వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను వేద పండితులు కండువాలతో సత్కరించి,ఆశీర్వచనాలు పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో, ప్రజలు ఆయురారోగ్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలి అని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తదితరులు శ్రీవెంకటేశ్వర స్వామిని వేడుకున్నారు.

# శ్రీ చైతన్య కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు.




పులివెందుల (కదిలించే వార్త) జనవరి 10: పులివెందులలోని శ్రీ చైతన్య కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ నారాయణ రాజు మాట్లాడుతూ వ్యవసాయ దేశమైన భారతదేశంలో ముఖ్యంగా రైతు పంట చేతికొచ్చిన వేళ కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకునే తెలుగు పండుగ సంక్రాంతి పండుగ వాటి సాంప్రదాయాలను వివరిస్తూ భోగిమంటలతో భోగభాగ్యాలను సమకూర్చే పండుగ సంక్రాంతి పండుగ అని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వై నారాయణరెడ్డి, కళాశాల డైరెక్టర్ సుబ్బారెడ్డి, నీరజ అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# కూడేరు వాణి స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు
### -పోటాపోటీగా సాగిన ముగ్గుల పోటీలు
### -విజేతలకు బహుమతులు అందజేసిన సి.ఐ రాజు



కూడేరు (కదిలించే వార్త) జనవరి 10: కూడేరులోని శ్రీ వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణమంతా పండగ వాతావరణం నెలకొంది .విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించారు. భోగి మంటలు వెలిగించారు .స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్ పిల్లలకు సంక్రాంతి పండుగ విశిష్టత గురించి వివరించారు.. విద్యార్థినులకు ముగ్గుల పోటీలను ఏర్పాటు చేశారు . ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సిఐ రాజు విచ్చేశారు .ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినిలకు సిఐ రాజు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీచర్లు ,పిల్లలు ,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి ని దర్శించుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, వరంగల్ కూడా చైర్మన్



హనుమకొండ (కదిలించే వార్త) జనవరి 10: వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని ప్రతి ఒక్కరి పై ఆ వైకుంఠ వాసుడి దివ్యాశీస్సులు ఉండాలని ప్రార్థిస్తూ మడికొండ శ్రీ మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి సహిత శ్రీ సీతా రామచంద్ర, అనంత పద్మ స్వామి వార్లను దర్శించుకొని ప్రతేక్య పూజలు అభిషేకాలు నిర్వహించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు, వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తొలుత ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యే, చైర్మన్ లను వేద మంత్రాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, చైర్మన్ లకు అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. ఇట్టి కార్యక్రమంలో మెట్టుగుట ఆలయ చైర్మన్ పైడిపాల రఘు చందర్, డైరెక్టర్లు, ఆలయ ఈవో శేషభారతి, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అంతరగంగలో ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు
### -ఆలయానికి పోటెత్తిన భక్తులు
### -మార్మోగిన చెన్నకేశవ స్వామి నామస్మరణ





కూడేరు (కదిలించే వార్త) జనవరి 10: కూడేరు మండల పరిధిలోని అంతరగంగలో ప్రఖ్యాతి గాంచిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత లక్ష్మి చెన్నకేశవ స్వామి దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు కళ్యాణం జరిపించారు .ఆ తర్వాత చెన్న కేశవలు మూల విరాట్ కు అర్చకులు విశేషంగా పూజలు నిర్వహించారు .వివిధ రకాల పట్టు వస్త్రాలు పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు. తర్వాత భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. చెన్న కేశవ స్వామిని దర్శించుకోవడానికి మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు .దీంతో ఆలయం భక్తులతో కీటకిటలాడిపోయింది . ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి నామస్మరణ మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# నేడు తనకల్లు మండలంలో ఎమ్మెల్యే పర్యటన



తనకల్లు(కదిలించే వార్త) జనవరి 10: కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం తనకల్లు మండలంలో పర్యటించనున్నారు. గొల్లవారిపల్లెలో గోకులం షెడ్లు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని టిడిపి సత్య సాయి జిల్లా బీసీ సెల్ఉపాధ్యక్షుడు సోంపాలెం నాగభూషణం తెలిపారు. రజక సంఘం అధ్యక్షుడు మిరాశి వేమ నారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు

# అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాల్సిందే
### -ఇంటి స్థలాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో పేదలు
### -తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



కూడేరు (కదిలించే వార్త) జనవరి 10: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ నేతలు ,పేదలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ మేరకు శుక్రవారం కూడేరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు ,పట్టణాల్లో రెండు సెంట్లు కేటాయిస్తామని చెప్పారు .అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట నిలుపుకోలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించి అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు కేటాయించి పక్కా ఇల్లు నిర్మించాలని కోరారు . ఈ మేరకు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు మండల కార్యదర్శి సుల్తాన్, కూడేరు మండల కార్యదర్శి నారాయణమ్మ ,ఆ పార్టీ నేతలు రమణ , మలరాయుడు ,ప్రసాద్, రమణప్ప ,ధనరాజ్, వెంకటేశులు ,కాసిం తీరా పీరా, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ ఆలయంలో ముక్కోటి ఏకాదశి పూజలో ఎమ్మెల్సీ దంపతులు



పులివెందుల **(కదిలించే వార్త) జనవరి 10:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం పులివెందుల శ్రీ కృష్ణ ఆలయంలో లో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ముందుగా ఆలయ నిర్వహకులు పిలుపుమేరకు ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరు కావడంతో వారిని సాధారణంగా ఆలయ వివాహకులు అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అతి పవిత్రమైన ముక్కోటి ఏకాదశి పర్వదినాన శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించి ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకోవడం భగవంతుడు కల్పించిన వరంగా భావించడం జరుగుతుందని, అలాగే ప్రతి ఒక్కరికి ముక్కోటి ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ భగవంతుడు ప్రతి ఒక్కరిని ఆశీర్వదించాలని కోరుకోవడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ వివాహకులు టిడిపి నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## నాగన్న బాధిత దళిత రైతు.



**(కదిలించే వార్త) జనవరి 10:** కోర్టుకు వెళ్లే స్తోమత కూడా దళితుల దగ్గర లేదని అధికారులు తప్పు దావ పట్టిస్తూ కోర్టుకు వెళ్లి తేల్చుకోవాలి మీరు కోర్టుకి వేసుకోవాలి అని దారి మళ్లిస్తున్నారు. మావద్ద కనీసం మండల రెవెన్యూ కార్యాలయానికి పోవడానికి కూడా చార్జీలకు తగిన సొమ్ము కూడా లేని నిరుపేద కుటుంబాలు మావి, కోర్టుకు వెళ్లి తేల్చుకుని స్తోమత మాకు లేదు. దయచేసి అధికారులు చిత్తశుద్ధితో మా భూముల సమస్యను పరిష్కరించండి.

## నల్లప్ప బాధిత దళిత రైతు.



**(కదిలించే వార్త) జనవరి 10:** రెవెన్యూ కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తెలిపిన ఫలితం లేకుండా పోయింది. కనీసం మాకు న్యాయం చేయకపోగా మా సమస్యను పట్టించుకునే నాథులు కూడా కరువయ్యారు. ఇప్పటివరకు రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మా సమస్యను తీర్చక పోగా కనీసం పట్టించుకున్న పాపను కూడా పోలేదు.

## ఎర్రప్ప బాధితు దళిత రైతు.



**(కదిలించే వార్త) జనవరి 10:** ఈ భూమి మా తాతల కాలం నుంచి మహా హక్కులోనే ఉంది మేము కేవలం ఈ భూమిలో సాగు చేసే పంటల మీదనే ఆధారపడి మా పిల్లలు మేము జీవనం కొనసాగిస్తున్నాము అటువంటి భూములు మాకు లేకుండా పోతే జీవనాధారం కోల్పోయి రోడ్డున పడవలసిన పరిస్థితులు వస్తాయి.

## మాజీ బీఎస్పీ నేత,సీనియర్ దళిత సంఘాల నాయకులు..

తూర్పుంటి ఆదినారాయణ



**(కదిలించే వార్త) జనవరి 10:** దళితుల హక్కులను కాపాడుకునేందుకు మరియు అభివృద్ధి కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగంలోని పొందుపరిచినప్పటికీ దళితులపై చిన్న చూపు చూస్తున్న అగ్రవర్ణ అదికులు ఉన్నంతకాలం దళితులను అనగార్చే విధంగా అనేక కుట్రలు కుతంత్రాలు జరుగుతూనే ఉంటాయి. అధికారులు దళితుల పట్ల చులకన భావాన్ని వదిలేసి తగిన న్యాయం చేసే విధంగా తక్షణమే చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల తరఫున మరియు మానవ హక్కుల సంఘాల తరఫున మరియు ఎస్సీ ఎస్టీ కమిషన్ తరఫున కుల సంఘాల తరఫున పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి అధికారుల అహంకారాన్ని ఎండగడతాము. ఇకనైనా అధికారులు స్పందించి తగిన న్యాయం చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరించడం జరుగుతుంది...

## ఇండస్ట్రియల్ పార్క్ జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్.



అనంతపురం,**(కదిలించే వార్త) జనవరి 10:** నగరంలోని బళ్లారి రోడ్ లో ఉన్న ఇండస్ట్రియల్ పార్క్ లో ఏపిఐఐసి ఇండస్ట్రియల్ పార్క్ జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తనిఖీ చేశారు. శుక్రవారం జోనల్ మేనేజర్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇండస్ట్రియల్ పార్క్ మరింత పొడగింపునకు ఏమైనా అవకాశం ఉందా అంటూ అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకోసం గ్రౌండ్ వాటర్ అందుబాటులో ఉన్న 100 ఎకరాల భూమిని గుర్తించాలని తహసిల్దార్ కు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మోహన్ కుమార్, ఏపీఐఐసి మేనేజర్ సాగర్, ఏపీఐఐసి అధికారులు,పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహాలు ఊరేగింపు





కనేకల్ **(కదిలించే వార్త) జనవరి 10:** కనేకల్ మండలం ఎన్ హనుమాపురం గ్రామంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీదేవి భూదేవి ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున విగ్రహాలు నడుము మధ్యలో భక్తులు ఎంతో భక్తి శ్రద్ధతో పూజ నిర్వహించారు కోలాటలు కార్యక్రమం నిర్వహించారు

## కన్నుల పండుగగా ముక్కోటి వైకుంఠ ఏకాదశి దర్శనం



కనేకల్ **(కదిలించే వార్త) జనవరి 10:** కనేకల్ గ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా దర్శనం కోసం భక్తులు ఉదయం నాలుగు గంటల నుండి శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనాన్ని కోసం బారులు తీరారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి ఉదయం నాలుగు గంటల నుండి స్వామివార్లకు అభిషేకం నిర్వహించి పంచామృత అభిషేకం స్వామివారికి రంగురంగుల పూలతో పుష్పాలంకరణ ముస్తాబు చేసి పూజలు నిర్వహించి అనంతరం తీర్థ ప్రసాదం వినియోగించారు దేవాలయం వారు. భక్తులు ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా గోవిందా నామస్మరణతో ఆలయంలో గోవిందా గోవిందా శ్రీ వెంకటేశ్వర స్వామి నామాలతో స్తోత్రాలతో పాటలతో భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలీస్ బందోబస్తు నిర్వహించారు

# అనంతలో ఎఫ్.కె తాజ్ మహల్ ఎగ్జిబిషన్ గ్రాండ్ ఓపెనింగ్



అనంతపురం, **(కదిలించే వార్త) జనవరి 10:** అనంతపురం, పరిసర ప్రాంత ప్రజలకు నూతన సంవత్సరం మరియు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలతో అనంత నగరంలో ఎఫ్.కె తాజ్ మహల్ ఎగ్జిబిషన్ మొట్టమొదటి సారిగా కనీవినీ ఎరుగని రీతిలో భారీ సెట్టింగ్ లతో ఏర్పాటు చేయడం జరిగిందని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఫక్రుద్దీన్ తెలిపారు.ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం 6 గం లకు రుద్రంపేట బైపాస్ వద్ద రుత్విక్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఎఫ్ కె ఎగ్జిబిషన్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామన్నారు.ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ అనంతలో మునుపెన్నడూ లేనివిధంగా ఢిల్లీ ఎర్రకోట ముఖద్వారంతో సినిమా తరహాలో తాజ్ మహల్ సెట్టింగ్ తో ఎఫ్.కె తాజ్ మహల్ ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని వయసుల వారికి అద్భుతమైన మధురానుభూతిని కలిగించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.పిల్లలు పెద్దలు కుటుంబ సభ్యులందరూ సరదానుభూతిని పొందే తాజ్ మహల్ అధునాతన హంగులతో అందరికి వినోదాన్ని ఆహ్లాదాన్ని అందించే అమ్యూజ్ మెంట్, మహిళల కోసం ప్రత్యేకంగా వివిధ రాష్ట్రాలనుండి గృహోపకరణ వస్తువులు, కళానైపుణ్యం గల బెడ్ షీట్స్, హ్యాండి క్రాఫ్ట్స్, జ్యువెల్లరీ ఐటమ్స్, లేటెస్ట్ హ్యాండ్ బ్యాగ్స్,రెడీ మేడ్స్ సరసమైన ధరలకు లభిస్తాయాని, ఢిల్లీ మసాలా అప్పడం, సిమ్లా బజ్జి, గోబీ మంచూరియ, పావ్ బాజీ, ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్ తదితర రుచికరమైన తినుబండారాలు అందుబాటులో ఉంటాయన్నారు.సాయం సంధ్య వేళ ఆహ్లాదకరమైన వాతావరణంలో మనసును రంజింపచేసి వినోదన్ని అందించేందుకు తాజ్ మహల్ ఎగ్జిబిషన్ లో ఇంకా కొలంబస్, జైంట్ వీల్, క్రాస్ వీల్, రోలార్ కోస్టర్ వంటి అనేక రకాల ఎమ్యూజ్ మెంట్ ఉంటుందన్నారు. ఈ అవకాశన్ని ప్రజలందరూ సద్వినియోగ పరుచుకొని వినోదంభరితమైన ఆహ్లాదాన్ని పొందాలని కోరారు. నగరంలోని రుద్రం పేట బైపాస్ రోడ్డు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ పక్కన, సబ్ రిజిస్టర్ ఆఫీస్ దగ్గర ఈ నెల 10 వ తేదీ నుండి ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటల కు ఎగ్జి బిషన్ ప్రారంభమై రాత్రి పది గంటల వరకు ఉంటుందని నిర్వాహకులు ఫక్రుద్దీన్ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంకిత్, నిఖిల్, రెహమాన్,చంద్ర శేఖర్ రెడ్డి సందర్శకులు పాల్గొన్నారు.

# మా భూమి మాకు ఇప్పించండి మహాప్రభో...

## దగా పడ్డ దళితుల ఆవేదన...

ఇల్లూరు గ్రామం,**(కదిలించే వార్త) జనవరి 10:** ఇల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలో గల భూమిని కొందరు బడా వ్యక్తులు అక్రమంగా కబ్జా చేయడం విధితమే. అయితే సదరు దళిత రైతులు పలుమార్లు అధికారులను సంప్రదించిన పట్టించుకోని వైనం కూడా విధితమే. అందువలన దళిత రైతులు స్థానిక మీడియాను ఆశ్రయించడం జరిగింది. ఈ సందర్భంగా దగా పడ్డ దళిత రైతులు ఆధారాలతో మీడియా ముందుకు రావడం జరిగింది. వారి తాతల కాలం నుంచి పిత్రార్జితంగా వారి హక్కు అనుభవంలో ఉన్నటువంటి భూములను కొందరు బడా వ్యక్తులు గత కొన్ని సంవత్సరాల క్రితం ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా అధికారులను అనుకూలంగా మార్చుకొని ఇటువంటి ఆధారాలు లేకుండా తమ భూములను కాజేశారని రైతులు తెలియజేశారు. గత కొన్ని రోజుల నుండి పలు మీడియా పత్రికలలో వరుస కథనాలు ప్రచురించబడినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై దళిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు కాబట్టే తమపై చిన్న చూపుతో తమ యొక్క సమస్యను అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని అగ్రవర్ణాల నాయకులు అయితే వారిని కార్యాలయాలలో కుర్చీలలో కూర్చోబెట్టి కాఫీ టీలు అందించి, అది తాగేలోపు సమస్యను తీర్చే విధంగా తక్షణ చర్యలు తీసుకునే అధికారులు కేవలం దళితులు ఏం చేయలేరు అని నెపంతోని తమ సమస్యను పట్టించుకోకుండా కబ్జాదారులకు కొమ్ముకాస్తూ వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ దళితుల హక్కులను కాల రాస్తున్నారని బాధ్యత దళిత రైతులు వాపోతున్నారు. తమ తాతల కాలం నుంచి సంక్రమించిన భూములను తాము సెంటిమెంట్ గా చూసుకుంటూ, ఆ భూముల మీదే ఆధారపడి తమ జీవితం కొనసాగిస్తున్నారని, గతంలో దళితులను అణిచివేయబడినప్పటి నుంచి దళితులకు స్థిరాస్తులు ఉండటం జీర్ణించుకోలేని కొందరు అగ్రవర్ణ అధికులు దళితులపై పగబట్టి కరకశంగా వ్యవహరిస్తున్నారని, ఈ భూములపై తమకు సర్వహక్కులు కలిగిన ధ్రువపత్రాలు తమ దగ్గర పదిలంగా ఉన్నాయని, రెవెన్యూ రికార్డులలో కూడా ఉన్నాయని కానీ ఎటువంటి ఆధారాలు లేకుండా డబ్బు కోసం కొందరు అధికారులు కుట్ర పూర్వక చర్యలకు పాల్పడి తమ భూములు అన్యాక్రాంతం అవ్వడానికి సహకరించారని, కబ్జాదారుల అరాచకాలకు అడ్డుకట్ట వేసేవారు లేకపోయారని సదరు రైతులు ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. వందల వేల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసి ప్రభుత్వాలకు సైతం కుచ్చుటోపి పెడుతున్న ఇలాంటి బడ నాయకులను ప్రభుత్వ అధికారులు ఏమి చేయలేకపోతున్నారని తద్వారా కేవలం రైతులు మాత్రమే బలి అవుతున్నారని సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి తమ గోడును విని తమకు తగిన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత దళిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,దళితుల హక్కులను కాపాడుకునేందుకు మరియు అభివృద్ధి కోసం బాబాసాహెబ్ అంబేద్కర్ గారు రాజ్యాంగంలోని పొందుపరిచినప్పటికీ దళితులపై చిన్న చూపు చూస్తున్న అగ్రవర్ణ అదికులు ఉన్నంతకాలం దళితులను అనగార్చే విధంగా అనేక కుట్రలు కుతంత్రాలు జరుగుతూనే ఉంటాయి. అధికారులు దళితుల పట్ల చులకన భావాన్ని వదిలేసి తగిన న్యాయం చేసే విధంగా తక్షణమే చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల తరఫున మరియు మానవ హక్కుల సంఘాల తరఫున మరియు ఎస్సీ ఎస్టీ కమిషన్ తరఫున కుల సంఘాల తరఫున పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి అధికారుల అహంకారాన్ని ఎండగడతాము. ఇకనైనా అధికారులు స్పందించి తగిన న్యాయం చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయని హెచ్చరించడం జరుగుతుంది...

తూర్పుంటి ఆదినారాయణ
మాజీ బీఎస్పీ నేత,సీనియర్ దళిత సంఘాల నాయకులు..

# ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ పథకం యువతకు సువర్ణావకాశం.

-జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ చేతులమీదుకు పోస్టర్ విడుదల.




అనంతపురం **(కదిలించే వార్త) జనవరి 10:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్షిప్ పథకం (పి ఎమ్ ఇంటర్నషిప్ స్కీం ) ద్వారా యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి తీసుకువస్తోంది, ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మక కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, మరియు ఆర్థిక సహాయం లభిస్తుంది.

**పథకం ముఖ్యాంశాలు:**

ఇంటర్న్షిప్ చేయడానికి టాప్ 500 కంపెనీలతో ఒప్పందం.
6- 12 నెలల ఇంటర్న్షిప్ (కనీసం 6 నెలలు ప్రాక్టికల్ పని).
ఇంటర్న్షిప్ లో ఎంపిక అయిన వారికి ఒనటైం,గ్రాంట్ రూ.6,000/-, ప్రతి నెలా రూ.4,500/- కేంద్ర ప్రభుత్వం నుండి మరియు రూ.500/- పరిశ్రమ సీస్సార్,నిధుల ద్వారా ఆర్థిక సహాయం మొత్తం 5000/-. బీమా పరిరక్షణ: పీఎంజేజై (ప్రధానమంత్రి జీవిత బీమా యోజన) మరియు పి ఎమ్ ఎస్ బి వై,(ప్రధానమంత్రి ప్రమాద బీమా యోజన) అర్హతలు: వయస్సు: 18 నుంచి 24 ^ంవత్సరాలు. 2.పదవ తరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్ బి ఏ , బి . స్సీ, బి కామ్ , బీసీ ఏ, బి బి ఏ, బి ఫార్మా మరియు బి టెక్,వంటి డిగ్రీలు పూర్తి చేసినవారు మరియు చివరి సెమిస్టర్ చదువుతున్నవారు. అనర్హులు: నేషనల్ లా యూనివర్సిటీలు, , %, మరియు ఎన అర్హతలున్నవారు. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద నైపుణ్యాలు, అప్రెంటీస్షిప్, ఇంటర్న్షిప్ లేదా విద్యార్థి శిక్షణ పొందుతున్న వారు. ఎప్పుడైనా ఎన్ ఏ టి ఎస్ లేదా ఎన్ ఏ పి ఎస్,కింద అప్రెంటీస్షిప్ లేదా శిక్షణ పూర్తి చేసిన వారు. 5. అభ్యర్థి కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఎఫ్ వై,2023-24 లో ఆదాయం రూ.8 లక్షలకంటే ఎక్కువ ఉన్నట్లు ఉంటే. 6.అభ్యర్థి కుటుంబ సభ్యుల్లో ఎవరు శాశ్వత/పరిపూర్ణ ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటే (కుటుంబం అంటే స్వయంగా జీవిత భాగస్వామి మరియు తల్లిదండ్రులు). దరఖాస్తు ప్రక్రియ: ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కోసం లింక్: /లాగిన్ మరిన్ని వివరాల కోసం సంప్రదించండి: కలిముల్లా 8341366022 9490682810, సంప్రదించాలని తెలిపారు.

# బిఇ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన

డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్
సమాజంలో సభ్యుల నైపుణ్యాలను పెంచడమే లక్ష్యం
ఎవరైనా పేర్లు నమోదుచేసుకుని ఉద్యోగర్హతకు నైపుణ్యాలు పెంచుకోవచ్చు
ఏడాదికి 600-720 మంది వరకు శిక్షణ ఇచ్చే అవకాశం



హైదరాబాద్, **(కదిలించే వార్త) జనవరి 10:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), తెలంగాణ ప్రభుత్వం సహకారంతో బయోలాజికల్ ఈ లిమిటెడ్ సీఎస్ఆర్ విభాగమైన డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్ బొల్లారంలో బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించింది. వ్యక్తులను శక్తివంతం చేయడానికి, స్థిరమైన జీవనోపాధి అవకాశాలను ప్రోత్సహించడానికి రూపొందించిన ఉచిత, పరిశ్రమ సంబంధిత శిక్షణా కార్యక్రమాల ద్వారా నిరుద్యోగ యువత నైపుణ్యాలను పెంపొందించాలన్నదే ఈ కేంద్రం లక్ష్యం. అధిక డిమాండ్ ఉన్న ఫార్మా, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ అండ్ వెల్నెస్, డిజిటల్ కమ్యూనికేషన్ (ఐటీ/ఐటీఈఎస్), రిటైలింగ్ లాంటి రంగాల్లో ఉచిత శిక్షణ, వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అందించేందుకు ఈ కేంద్రం సిద్ధమైంది. స్థానిక యువత ఈ కార్యక్రమాల్లో చేరి ఉపాధి పొందవచ్చు. ఒక్కో శిక్షణ కార్యక్రమం మూడు నెలల పాటు ఉంటుంది. ప్రతి కోర్సుకు శిక్షణ పొందిన బోధకులు ఉంటారు. ఒకేషనల్ కోర్సులకు నిర్దిష్ట అర్హత అవసరం లేదు. పారిశ్రామిక కోర్సులకు కనీసం పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా లేదా డిగ్రీ చదివినవారు అర్హులు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందాలనుకునే మహిళల్లో ఎవరికైనా చిన్న పిల్లలు ఉంటే, వారి సంరక్షణ సేవలను కూడాఇక్కడ ఉచితంగా అందిస్తారు. దీనివల్ల వారు తమ పిల్లలను సురక్షితమైన వాతావరణంలో ఉంచి.. తమ శిక్షణ, నైపుణ్య అభివృద్ధిపై దృష్టి పెట్టచ్చు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ త్రిషన్య రాజు మాట్లాడుతూ "నైపుణ్యాభివృద్ధి ద్వారా ప్రజలకు సాధికారత కల్పించాలన్న మా నిబద్ధతకు ఈ కేంద్రమే నిదర్శనం. నిరుద్యోగ యువతకు శిక్షణ, నైపుణ్యాలు అందించడం, సుస్థిర జీవనోపాధి కల్పించడం, కమ్యూనిటీలను బలోపేతం చేయడం కోసం జీహెచ్ఎంసీ, తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. నైపుణ్యాభివృద్ధి ద్వారా సమాజాన్ని సాధికారం చేయడం ఒక పరివర్తనాత్మక ప్రయాణం. ఇది కేవలం ఒక మిషన్ కాదు. బయోలాజికల్ ఇ. లిమిటెడ్ వారి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో.. మేము సామర్థ్యాన్ని అవకాశంగా మారుస్తాము. స్థిరమైన వృద్ధిని ప్రోత్సహిస్తాము. అందరికీ ఉజ్వల భవిష్యత్తును ప్రోత్సహిస్తాము" అన్నారు. డాక్టర్ విజయ్ కుమార్ దాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీలో ఖాళీగా ఉన్న మోడల్ మార్కెట్ భవనాన్ని పునరుద్ధరించి తరగతి గదులు, క్యాంటీన్, కౌన్సెలింగ్ గది, ఫార్మాస్యూటికల్ ట్రైనింగ్ ల్యాబ్ లు, ఐటీ/ఐటీఈఎస్ శిక్షణ కోసం 16 సీట్ల కంప్యూటర్ ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో ప్రతి మూడు నెలలకు 180 మంది అభ్యర్థులకు అన్ని కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ఇలా సంవత్సరానికి 600-720 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు.




**దాట్ల ఫౌండేషన్ గురించి:**

దాట్ల ఫౌండేషన్ భారతదేశం అంతటా విద్య, ఆరోగ్యం, ఐటీ అక్షరాస్యత, నైపుణ్య అభివృద్ధి, కమ్యూనిటీ సంక్షేమాన్ని మెరుగుపరచడానికి అంకితమైంది. ప్రభావవంతమైన సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా కమ్యూనిటీలను మెరుగుపరచడం, ప్రలకు సాధికారత కల్పించడం ఫౌండేషన్ లక్ష్యం అన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ ఏ ఐ ఎస్ ఎఫ్ శశికుమార్



కనేకల్ **(కదిలించే వార్త) జనవరి 10:** కనేకల్ మండలంలో రాయదుర్గం నియోజకవర్గం అధ్యక్షుడు శశి కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేయడం జరిగింది అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి ప్రిన్సిపాల్ సార్ తో మాట్లాడి విద్యార్థులకు న్యాయం ఏమైనా ఆహారం అందించాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భీమేష్, రాజ్ కుమార్, సాయికుమార్, మనోజ్ కుమార్ తదితరులు తనిఖీ చేయడం జరిగింది.



## సైబర్ నేరగాళ్ల వలలోకి పడకుండా అప్రమత్తంగా ఉండండి.

-జిల్లా ఎస్పీ ఆదేశాలతో బెళుగుప్ప మండలం శ్రీరంగాపురంలో సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన.

-సైబర్ నేరాల పట్ల అవగాహన కోసం తయారు చేయించిన క్యాలెండర్లు గ్రామస్తులకు అందజేత.




అనంతపురం **(కదిలించే వార్త) జనవరి 10:** సైబర్ నేరగాళ్ల వలలోకి పడకుండా అప్రమత్తంగా ఉండాలని బెళుగుప్ప ఎస్సై శివ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్,ఆదేశాల మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు మండల పరిధిలోని శ్రీరంగాపురంలో గ్రామ ప్రజలతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన చేశారు. డబ్బు సులువుగా ఎవరికీ ఊరకనే రాదు, ఇవ్వరని... అలాంటి మాయమాటలకు మోసపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డిజిటల్ అరెస్టు, లోన్ యాప్ ఫ్రాడ్స్, ఏపికె ఫైల్స్ ఫ్రాడ్స్ , తదితర మోసాలు గురించి అవగాహన చేయడంతో పాటు సైబర్ నేరాల అవగాహన కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన క్యాలెండర్లను గ్రామస్తులకు అందజేశారు. సైబర్ నేరం జరిగిన తక్షణమే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్సై కోరారు.

## సంపాదకీయం

# అందరూ అంబేడ్కర్ ఆరాధకులే!

డిసెంబరు 17న రాజ్యసభలో హెూం మంత్రి అమిత్ షా, కాంగ్రెసుని ఎద్దేవా చేస్తూ, “అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్! అంబేడ్కర్!’ అనడం ఇప్పుడు కొందరికి ఒక ఫ్యాషన్ అయింది. అదే, దేవుడి పేరుని అన్నిసార్లు పలికితే, ఏడు జన్మలవరకూ (‘సాత్ జనమ్ తక్’) వాళ్ళకు స్వర్గం దొరుకుతుంది” అన్నాడు! దానికి నిరసనగా ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, “అమిత్ షా, అంబేడ్కర్‌ని (‘అంబేడ్కర్ ఏమన్నా దేవుడా, అన్నిసార్లు అనడానికి?’ అనే అర్థంతో) అవమానించాడు కాబట్టి, ఆయన క్షమాపణ చెప్పాలి! అమిత్ షా, మంత్రి పదవికి రాజీనామా చెయ్యాలి! ప్రధానమంత్రి ఆయన్ని మంత్రిగా తీసివెయ్యాలి!” అని ప్రదర్శనలు చేశారు. కాంగ్రెసు వారి నిరసనలకి వ్యతిరేకంగా, బీజేపీ ఎంపీలు కూడా పోటీ ప్రదర్శనలు చేశారు. ఈ రెండు పార్టీలూ, వాటి మిత్రపక్షాలూ చేసిన, చేస్తున్న వాదనలు ఇలా ఉన్నాయి: “అంబేడ్కరు రాజ్యాంగశిల్పి! ఆయన్ని మీరు (బీజేపీ) అవమానించారు. అసలు మీకు రాజ్యాంగం మీద నమ్మకమే లేదు. మీ నమ్మకమంతా మనుస్మృతి మీదే! ఆ మనుస్మృతి పుస్తకాన్ని అంబేడ్కరు, 1927 డిసెంబరు 20న తగలపెట్టేశాడు. 1949 డిసెంబరులో, మీ ఆరెస్సెస్ వాళ్ళూ, హిందూమహాసభ వాళ్ళూ, అంబేడ్కరు దిష్టిబొమ్మని తగలబెట్టారు. అంబేడ్కరు రాసిన రాజ్యాంగం అంతా విదేశీయమైనదని దాన్ని ఖండించారు. మీ పదేళ్ళ పాలనలో, ఎస్సీల మీదా, ఎస్టీల మీదా 30 వేల, 4 వందల దాడులు జరిగాయి. అంబేడ్కర్ పెట్టిన రిజర్వేషన్లని క్రమంగా రద్దు చెయ్యాలని కుట్ర పన్నుతున్నారు.” ఈ రకంగా సాగింది కాంగ్రెస్ వాదన! “అంబేడ్కర్‌ని కాంగ్రెస్ గతంలో రెండుసార్లు ఎన్నికల్లో ఓడించింది. ‘భారత రత్న’ లాంటి అత్యున్నత బిరుదుల్ని మీ కుటుంబ సభ్యులకే మీరే ఇచ్చుకున్నారు గానీ, మహా మేధావి అయిన అంబేడ్కరుకి ఇవ్వలేదు. 1990లో, వీపీ సింగ్ ప్రభుత్వం మా పార్టీ మద్దతుతో నడుస్తూ, ఆ గొప్ప బిరుదుని అంబేడ్కరుకి ఇచ్చింది. అప్పట్లో, కర్ణాటకలో ఐదేళ్ళపాటు జరిగిన మీ పాలనలో ఎస్సీ, ఎస్టీల మీద దాదాపు తొమ్మిదివేల దాడులు జరిగాయి. 1940లో అంబేడ్కరు, పాకిస్తాన్ గురించి రాస్తూ, ‘ఇస్లాం మతం%-% మనుషుల్ని ముస్లింలుగానూ, ముస్లింలు కాని వారుగానూ విభజిస్తుంది’ అని విమర్శించాడు. మీరేమో, ఓట్లకోసం మమ్మల్ని మతతత్వవాదులుగా విమర్శిస్తూ, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను బుజ్జగిస్తున్నారు. 1939లో అంబేడ్కరు, ఆరెస్సెస్ ఆఫీసుని సందర్శించి, వారి శాఖల్లో, కుల వివక్షలేదని గమనించి ప్రశంసించాడు.” ఇది బీజేపీ వాదం! ఈ రకంగా, రెండు ప్రధాన పార్టీల కూటములూ పరస్పరం%-% అంబేడ్కరుని మీరు అవమానించారంటే.. కాదు మీరు అవమానించారని, ఒకరినొకరు పరుషపదాలతో వాదులాడుకున్నారు. ఇంగ్లీషూ, హిందీ టీవీల డిబేట్లలో, రెండు కూటముల మేధావి సమర్థకులు కూడా గొంతులు చించుకుని, ‘అంబేడ్కర్ ఆశయాలను ఆచరించేది మేమంటే, మేము’ అని పోటీలు పడి చెప్పుకున్నారు. కానీ, కొన్ని వాదనలకు ఇరు పక్షాలూ జవాబులు చెప్పలేకపోతున్నాయి. అయినా, కొన్నిటికి చరిత్రనించీ ఆధారాలను చూపుతున్నారు. ఉదాహరణకి, 1949 సెప్టెంబరు 7న, తనని కలిసిన ఆనాటి ఆరెస్సెస్ అగ్రనాయకుడైన గురు గోల్వాల్కర్‌తో అంబేడ్కరు ఏమన్నాడో కాంగ్రెస్ సమర్థకులు ఆ మాటల్ని కోట్ చేశారు. “ఆరెస్సెస్ ఒక విషవృక్షం లాంటిది. అది పీష్వాల పాలనని కలగంటున్నది! నేను దానితో ఉండడం సాధ్యం కాదు” అని అంబేడ్కరు అన్నాడని పాత పుస్తకాల నుంచీ, బీజేపీ వ్యతిరేకులు రుజువు చూపుతున్నారు! కొందరు కొన్నిటికి ఏ ఆధారాలూ చూపకుండా మాట్లాడుతున్నారు. ఆరెస్సెస్‌లో, కుల వివక్ష లేదని అంబేడ్కర్ మెచ్చుకున్నాడనే దానికి, బీజేపీ సమర్థకులు తారీకులూ దస్తావేజులూ చూపలేదు! రెండు పార్టీలూ చేసిన వాదనలలోనూ, కొన్నిటిని చెప్పి, కొన్నిటిని మరుగుపరిచీ చేసిన వాదనలు కూడా ఉన్నాయి. ఉదాహరణకి, ‘పాకిస్తాన్ లేదా దేశ విభజన’ అనే పుస్తకంలో (సంపుటి%-%8, పేజీ%-%358), అంబేడ్కరు ఇస్లాం గురించి చేసిన విమర్శ గురించి మాత్రమే మాట్లాడి, అదే పుస్తకంలో అంబేడ్కరు హిందూమతం గురించి విమర్శ చేసినా, దాని గురించి బీజేపీ వారు మాట్లాడడం లేదట! ఇది, కాంగ్రెస్ వారి విమర్శ. “హిందువులు ఏమన్నా చెప్పనీ, హిందూ మతం అనేది స్వేచ్ఛా, సమానత్వమూ, సోదరభావమూ అనే వాటికి వ్యతిరేకమైనదే. ఆ రకంగా, అది ప్రజాస్వామ్యంతో పొసగదు (ఇన్ కంపాటిబుల్)” ఈ మాటలు అంబేడ్కరు అన్నాడని బీజేపీ వ్యతిరేకులు చూపే రుజువులు.

# రహదారిపైనే నిలుపుతున్న వాహనాలు

## డ్రైవర్ల నిర్లక్ష్యంతో పోతున్న ప్రాణాలు




కోదాడరూరల్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లాలో చివరగా ఉన్న కోదాడ మండలంలో పలు చౌరస్తాలు, మలుపులు ప్రమాదాలకు అలవాలంగా నిలుస్తున్నాయి. రామాపురం క్రాస్‌రోడ్డు నుంచి కొమరబండ వరకు 15 కిలోమీటర్ల పరిధిలోని ఈ హైవేపై నవంబరు 20 నుంచి నెల వ్యవధిలో 13 ప్రమాదాలు జరగ్గా అందులో నలుగురు మృతి చెందారు. 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఎక్కువగా ప్రమాదాలు కొమరబండ-దుర్గాపురం రోడ్డు జంక్షన వద్ద జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి కోదాడకు వచ్చేందుకు అండర్‌పాస్ వంతెన లేకపోవడంతో ఈ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రమాదాలు ఎక్కువగా రాత్రి సమయాల్లో జరుగుతున్నాయి. కొమరబండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లాలంటే జాతీయరహదారిని దాటిల్సిన పరిస్థితి. విజయవాడ వైపు నుంచి కోదాడ పట్టణంలోకి రావాలంటే జాతీయ రహదారిని దాటాలి. ఈ క్రమంలో పాదాచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల దోరకుంట వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి సిమెంట్ ట్యాంకర్ ఢీకొనడంతో ట్యాంకర్ పెద్దశబ్దాలతో పేలిపోయింది. దీంతో పక్కన వెళ్లే వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. హైవేపై పెట్రోలింగ్ వాహనాలు మచ్చుకు కూడా కనిపించడం లేదని వాహనదారులు తెలిపారు. ఇదిలాఉండగా కొమరబండ, కట్టకొమ్మగూడెం బైపాస్, దుర్గాపురం, రామాపురం క్రాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా ఇటీవల ప్రారంభమయ్యాయి. చౌటుప్పల్ రూరల్ : హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై ప్రధాన మండలాల్లో యాదాద్రిభువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ మండలం ఒకటి. ఈ మండల పరిధిలోని తుప్రానపేట నుంచి గుండ్లబావి వరకు 27కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. రహదారి వెంబడి ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపైనే హెూటళ్లు ఉండడం, టిఫిన, భోజనాల కోసం రోడ్డు పక్కన వాహనాలు నిలుపుతున్నారు. లింగోజిగూడెం, చౌటుప్పల్, ఎల్లగిరి, దండుమల్కాపురం ప్రాంతాల్లో వాహనాలు ఎక్కువగా రోడ్లపైన నిలుపుతున్నారు. రోడ్డు పక్కన నిలిచి ఉన్న వాహనాలను వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలను గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

### కనిపించని పెట్రోలింగ్

చౌటుప్పల్ జాతీయ రహదారిపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెండు పెట్రోలింగ్ వాహనాలు ట్రాఫిక్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోలింగ్ వాహనాలు జాతీయ రహదారికి తిరగడానికి కేటాయించారు. హైవేపై ఏదో ఒక చోట పెట్రోలింగ్ వాహనాలు నిలిపి తూతూ మంత్రంగా విధులు నిర్వహిస్తున్నారు. రోడ్ల వెంట నిలిపిన డ్రైవర్లను చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

### హైవే నిర్వహణ అస్తవ్యస్తం

కేతేపల్లి : నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి నిర్వహణ ఆరు నెలల నుంచి అస్తవ్యస్తంగా మారింది. 2011-12లో ఈ రహదారి విస్తరణ పనులు పూర్తి చేసిన జీఎమ్మార్ సంస్థ గత ఆరు నెలల క్రితం వరకూ ఈ రహదారిపై టోల్ వసూలు, రహదారి నిర్వహణ పనులు చూసేది. ఆరు నెలల క్రితం రహదారి నిర్వహణ, టోల్ వసూలు నుంచి జీఎమ్మార్ తప్పుకోవడంతో టోల్ వసూలు, రహదారి నిర్వహణలను ఎన్‌హెచ్‌ఏఐ వేర్వేరు సంస్థలకు తాత్కాలిక ప్రాతిపదికన అప్పగించింది. నాటి నుంచి ఈ హైవే నిర్వహణ అస్తవ్యస్తంగా మారిపోయింది. ఈ క్రమంలో రహదారిపై ఎక్కడబడితే అక్కడ వాహనాలు నిలిపి వేస్తున్నా పట్టించుకునే వారే లేకుండాపోయారు. ఏదైనా వాహనం పాడై రోడ్డుపై నిలిచిపోతే గతంలో హైవే పెట్రోలింగ్ వాహనం సదరు వాహనాన్ని రోడ్డు పక్కకు తరలించేది. ఇతర వాహనాలు దానికి ఢీకొని ప్రమాదాలు జరగకుండా నివారించే చర్యలు తీసుకునేది. ప్రస్తుతం అలాంటిదేమీ లేకపోవడంతో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. హైవేపై డివైడర్ల వెంట, వైవే వెంట గల గ్రామాల్లోని సర్వీసు రోడ్లపైన పేరుకపోయిన ఇసుక, మట్టిని తొలగించే వారు సైతం లేకుండాపోయారు. దీంతో హైవే, గ్రామాల్లోని సర్వీసు రోడ్లు మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. హైవేపై ఎడమ వైపున ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు గల రోడ్డు పూర్తిగా మట్టితో నిండిపోయి బ్రైక్ వేస్తే వాహనాలు జారి పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. అలాగే రహదారిపై ఇరువైపులా ప్రయాణించే వాహనాల హెడ్‌లైట్ల వెలుతూ రాత్రివేళల్లో ఎదుటి వాహనాలపై పడకుండా ఉండేందుకు హైవే మధ్యలో గల డివైడర్‌పై పెంచిన పూల మొక్కలకు నీరు పోసేవారు లేకపోవడంతో పెద్ద ఎత్తున మొక్కలు ఎండిపోతున్నాయి.

### ఎక్కడపడితే అక్కడే

కోదాడ : కోదాడ- జడ్చర్ల రాష్ట్ర రహదారిపై అతివేగంతో కూడిన డ్రైవింగ్, రహదారిపై వాహనాలను నిలపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చిలుకూరు మండలంలో బాలాజీనగర్ నుంచి ముక్త్యాల కాల్వ వరకు ఎనిమిది కిలోమీటర్ల హైవే ఉంది. కొత్తగా నిర్మించిన రహదారిపై డివైడర్ లేకపోవడం, డివైడర్లు, ప్రధానజంక్షన్ల వద్ద సూచిక బోర్డులు లేకపోవటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని గరిడేపల్లి మండలంలో రాయినిగూడెం బ్రిడ్జి నుంచి ఎల్‌బీ నగర్ వరకు 14 కిలోమీటర్ల రహదారి ఉండగా ఈ ఏడాదిలో 23 ప్రమాదాలు జరగ్గా అందులో 11మంది చనిపోయారు. 15 మంది క్షతగాత్రులయ్యారు. ప్రధానంగా రాయినిగూడెం, అప్పన్నపేట, అప్పిరెడ్డిగూడెం క్రాస్‌రోడ్డు, ఎల్బీనగర్ చౌరస్తాలో ప్రమాదాలు జరుగుతున్నాయి. హుజూర్‌నగర్ పరిధిలో నాలుగు ప్రమాదాలు జరగ్గా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

### అమ్మో...హైదరాబాద్-వరంగల్ హైవే

భువనగిరి టౌన: యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరి పట్టణ పరిధిలోని నాలుగు కిలోమీటర్ల మేర విస్తరించిన హైదరాబాద్-వరంగల్ జాతీయరహదారి ప్రమాదాలకు నెలవుగా మారి ంది. ఈ ఏడాదిలో 29 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 11 మంది మృతి చెందారు. 40 మంది వరకు గాయపడ్డారు. సింగన్నగూడెం చౌరస్తా, రామకృష్ణాపురం క్రాస్‌రోడ్, రేణుక ఎల్లమ్మ, స్వర్ణగిరి ఆలయాల జంక్షన, డాల్ఫిన హెూటల్ ప్రమాదాలకు కేంద్రాలుగా ఉన్నాయి. తాజాగా ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. రహదారి పక్కనే పలు కారణాలతో ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేస్తుండడం, రాంగ్ డ్రైవింగ్ మితిమీరిన వేగం, తదితర కారణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దశలవారీగా పెట్రోలింగ్, నిర్వహిస్తున్నా ప్రమాదాలు తగ్గడం లేదు.

ఒక్క మండలంలో ఏడాదిలో 9 మంది

వేములపల్లి: నల్లగొండ జిల్లా పరిధిలో నార్కట్‌పల్లి నుంచి దామరచర్ల మండలం వరకు విస్తరించి ఉన్న నార్కట్‌పల్లి-అద్దంకి రహదారి నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. సుమారు 92 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రోడ్డు నిర్మాణ సమయంలో మూలమలుపుల వద్ద, రహదారికి చేరుకొనే పలు రోడ్ల వద్ద సాంకేతిక జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో వేముపల్లి మండలంలో 18 ప్రమాదాలు చోటుచేసుకోగా 9 మంది మృత్యువాతపడ్డారు.

# శవ రాజకీయాలు చేయడం మొదటి నుంచి జగన్ కు అలవాటే

తిరుపతి ఘటనను కావాలనే రాజకీయం చేస్తున్నారు

వైసీపీ అధినేత జగన్ పై విరుచుకపడ్డ ఎమ్మెల్యే దగ్గుపాటి

సీఎం చంద్రబాబు ఈ ఘటనపై ఎంత తీవ్రంగా స్పందించారో కనిపించలేదా

తిరుపతికి మంది మార్బలంతో వెళ్లి నువ్వు చేసిందేంటి.. దగ్గుపాటి

అనంతపురం, (కదిలించే వార్త) జనవరి 10: వైసీపీ అధ్యక్షుడు జగన్ రెడ్డికి మొదటి నుంచి శవ రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఘటన విషయంలో జగన్ తో పాటు వైసీపీ నాయకుల చేస్తున్న వ్యాఖ్యల మీద ఆయన తీవ్రంగా స్పందించారు. తిరుపతి ఘటన అనుకోకుండా జరిగిందన్నారు. ఇందులో ఆరు మంది చనిపోవడం పట్ల దగ్గుపాటి విచారం వ్యక్తం చేశారు. అయితే ఈ ప్రమాదం విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు హుటాహుటిన తిరుపతి చేరుకొన్నారన్నారు. ఈ ప్రమాద సంఘటన పై అటు టీటీడీ అధికారులు, ఇటు పోలీస్ యంత్రాగం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు కూడా తీసుకున్నారన్నారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున 25 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇక ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబు, పలువురు మంత్రులు చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారని దగ్గుపాటి అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్షమాపణ కూడా చెప్పారన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే దీనిని రాజకీయం చేసేందుకు జగన్ తో పాటు వైసీపీ నాయకులంతా



ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందా.. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆపాదిద్దామా అని గోతి కాడ నక్కల్లా కాచుకుని కూర్చుని ఉంటారన్నారు. తిరుపతిలో 6మంది చనిపోయి దుఃఖంలో ఉంటే జగన్ మంది మార్బలంతో వెళ్లి హడావుడి చేశారన్నారు. దీని వలన ఆసుపత్రిలో బాధితులు ఎంత అసౌకర్యానికి గురయ్యారో తెలుసుకోరా అని మండిపడ్డారు. మరోవైపు జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు కూడా చంద్రబాబు పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని.. అసలు రాష్ట్రంలో ఏదైనా సంఘటన జరిగితే గతంలో జగన్ ఎప్పుడు స్పందించారో ఒకసారి చూసుకోవాలన్నారు. ఇకనైనా ప్రమాదాల విషయంలో అయినా రాజకీయాలు చేయకుండా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి హితవు పలికారు....

# కసాపురం శ్రీ శ్రీ శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి మహా వైభవం

కసాపురం, (కదిలించే వార్త) జనవరి 10: 10.1.25 కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానం నందు ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహా వైభవంగా విద్యుత్ కాంతులతో పూలలంకరణతో హైదరాబాద్ దీక్షిత్ సుబ్రహ్మణ్యం, భక్తిగానులహరి ప్రవచనాలు సాంస్కృత కార్యక్రమాలలోకనుల పండుగగా భక్తులకు వీనుల విందుగా రాత్రి 12 గం నుండి ఉ 5 వరకు సకల దేవాను దేవతలు స్వామి అమ్మవారిని దర్శించు మోక్ష ద్వారం మహా వైభవంగా అర్చకుల పూజలతో భజన బృందాల సభ్యులు భక్తుల హరినామ కీర్తనల తో ద్వారం తెరవబడినది ఉదయం భక్తులకు గడప దర్శనం ఏర్పాటు చేయడం జరిగింది ఉదయం 5:30 నుండి భక్తుల ఉత్తర ద్వారా దర్శనం ఏడు నాగుల పడగలతో కలియుగ దైవం మహావిష్ణువు మహాలక్ష్మి కొలువైన శ్రీ లక్ష్మీనారాయణ స్వామి దివ్య దర్శనం వేలాది మంది భక్తులు విఐపి రాజకీయ నాయకులు అధికారులు ప్రజలకు వైభవంగా స్వామి అమ్మవారి దర్శన భాగ్యం కలగడం వచ్చిన ప్రతి భక్తులు ఇలాంటి స్వామి అమ్మవార్ల విగ్రహాలు ఎక్కడ చూడలేదని ఆనందాని సంతోషాన్ని మా జన్మ ధన్యమంటూ మాకు మీ నుండి ఇంతటి భాగ్యం కలిగిందంటూ మీరు నిత్య





చిరంజీవులుగా తలారి శకుంతలమ్మ పరశురాముడు దంపతులు ఉంటారని పెద్దలు దీవెనలు ఇస్తూ ఆలయ అర్చకులు నందకిషోర్ స్వామి రాకేష్ స్వామి చెన్న కేశవ స్వామిఉదయం నుండి క్రమ పద్ధతిగా క్యూలైన్లలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం చాలా సంతోషం అన్నారు విగ్రహ ప్రతిష్ట పది నెలల కాలంలోనే ఎంత



అపురూపంగా దేవాలయం వెలగొందుతుంది అంటే నిజంగా సాక్షాత్తు శ్రీ లక్ష్మీనారాయణ కొనవైన స్థానం కావున నిత్య అన్న ప్రసాద వితరణ కానీ ఆలయంలో పూజలు కానీ భక్తులు అనుకున్న కోరికలన్నీ



నెరవేరుచున్నాయి అంటే కానీ ఇదంతా భగవంతుని నిజ స్వరూపమే అన్నారు ఈరోజు వేలాది మంది భక్తులు ప్రజలు స్వామివారి దేవస్థానం పోవచ్చు స్వామివారి దర్శించి స్వామి వారి ఆశీస్సులు పొందినందుకు వారికి గరుడ సేవ సత్య జనార్ధన్ మంజు వారి మిత్రబృందానికి లక్ష్మీనారాయణ స్వామి ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శంకరప్ప మురారి ట్రస్ట్ సభ్యులు మహిళలు అన్నప్రసాద వితరణ సేవాసమితి కమిటీ సభ్యులకు ముక్కోటి వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తూ అందరూ బాగుండాలి అది చూసి మనమానందించాలి అన్నారు ఎమ్మెల్యే తమ్ముడు నారాయణస్వామి.మస్తానప్ప కృపాకర్. కృష్ణారెడ్డి ఆనంద్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టెక్ వ్యూ : తదుపరి నిరోధం 24,000



నిఫ్టీ గత వారం మైనర్ పుల్‌బ్యాక్ రికవరీ సాధించి ముందు వారంతో పోల్చితే 225 పాయింట్లు లాభపడింది. అయితే గత వారం 24,000–23,600 పాయింట్ల మధ్యన పరిమిత పరిధిలోనే కదలాడింది. ప్రస్తుతం 23,800 వద్ద అప్రమత్త ధోరణిలో నిలిచి ఉంది. గత వారం మిడ్‌క్యాప్–100 సూచీ 73 పాయింట్లు, స్మాల్‌క్యాప్–100 సూచీ 40 పాయింట్ల స్వల్పలాభంతో ఫ్లాట్‌గా ముగిశాయి. టెక్నికల్‌గా మార్కెట్ ఇటీవల సాధించిన గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల నడుమన నిలిచి ఉండడం అనిశ్చిత ధోరణిని సూచిస్తోంది. ప్రస్తుత స్థితిలో మరింత కన్సాలిడేషన్ అవసరం. స్థూల ట్రెండ్ మాత్రం ఇంకా బలహీనంగానే ఉంది. గత శుక్రవారం గరిష్ఠ స్థాయిల్లో బలహీన ధోరణి ప్రదర్శించడం కూడా మరింత బలహీనత ఉందనేందుకు సంకేతం. శుక్రవారం అమెరికన్ స్టాక్‌మార్కెట్లో ఏర్పడిన బలహీన ట్రెండ్ కారణంగా ఈ వారంలో భారత మార్కెట్ అప్రమత్తంగా కదలాడే ఆస్కారం ఉంది.

**బుల్లిష్ స్థాయిలు:** నిఫ్టీకి ప్రధాన స్వల్పకాలిక నిరోధం 24,000. ఇక్కడే గత కొన్ని వారాలుగా పలు ప్రయత్నాలు చేసి మార్కెట్ విఫలమవుతూ వస్తోంది. స్వల్పకాలిక సానుకూలత కోసం మార్కెట్ ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 24300, 24,550.

**బేరిష్ స్థాయిలు:** మార్కెట్‌కు 23,650 వద్ద మైనర్ మద్దతు ఉంది. ఇదే గత గురువారం ఏర్పడిన బాటమ్. ఈ స్థాయి కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** గత వారం ఈ సూచీ టెక్నికల్ బౌన్స్‌బ్యాక్ సాధించి 550 పాయింట్ల స్వల్ప లాభంతో 51,300 వద్ద ముగిసింది. సానుకూలత కోసం ప్రధాన నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 52,000. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం ప్రధాన మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకుని పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి.

**పాటర్న్:** నిఫ్టీ ప్రస్తుతం 200 డిఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. సానుకూలత కోసం 24,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. ఇక్కడ నిలదొక్కుకుంటే సానుకూల ధోరణి ఏర్పడుతుంది.

**టైమ్ :** ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

### డిజిటల్ లావాదేవీలు జోరు..

## దేశంలో పెరిగిన సైబర్ మోసాలు: ఆర్బీఐ



దేశంలో సైబర్ మోసాలు పెరిగాయి. డిజిటల్ లావాదేవీలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో అమాయకులే లక్ష్యంగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తాజా నివేదికే ఇందుకు నిదర్శనం. డిసెంబర్ నెలకుగాను ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్) పేరిట సోమవారం ఆర్బీఐ రిపోర్టు విడుదల చేసింది. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ప్రథమార్ధం (ఏప్రిల్–సెప్టెంబర్) 18,461 సైబర్ మోసాలు జరిగాయని, వీటి విలువ రూ.21,367 కోట్లని తెలియజేసింది. గత ఆర్థిక సంవత్సరం (2023–24) ఇదే వ్యవధిలో 14,480 కేసులు నమోదయ్యాయని, వాటి విలువ కేవలం 2,623 కోట్లేనన్నది. ఈ క్రమంలోనే సైబర్ మోసాల గురించి అందరిలోనూ అవగాహన పెరగాల్సిన అవసరం ఉన్నదని నొక్కి చెప్పింది. అంతేగాక మనీ లాండరింగ్‌కు దారితీసే మ్యూల్ అకౌంట్స్‌ను గుర్తించడం కూడా చాలా ముఖ్యమని పేర్కొన్నది. కాగా, సైబర్ మోసాల బారినపడ్డ బాధితులు ఆర్థికంగా నష్టపోతున్నారని, మానసికంగా కూడా తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారని ఆర్బీఐ ఈ సందర్భంగా ఒకింత ఆందోళన వ్యక్తం చేసింది.

**ఈసారి జీడీపీ 6.6 శాతం**

ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీ వృద్ధిరేటు 6.6 శాతంగా ఉండొచ్చని ఆర్బీఐ ఈ సందర్భంగా అంచనా వేసింది. వచ్చే ఏడాది ఆర్థిక వ్యవస్థ మెరుగుపడే అవకాశాలే ఉన్నాయని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు.

**నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల్లో లబ్ధిదారు పేరు**

వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఆన్‌లైన్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ వ్యవస్థలైన నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ (ఆర్టీజీఎస్)ల్లో వినియోగదారులకు లబ్ధిదారు పేరు కనిపించే సదుపాయాన్ని బ్యాంకులు కల్పించనున్నాయి. ఈ మేరకు సోమవారం ఆర్బీఐ ఓ సర్క్యులర్‌ను జారీ చేసింది. ప్రస్తుతం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్స్ సర్వీస్ (ఐఎంపీఎస్) సిస్టమ్స్‌ల్లోనే ఈ తరహా సౌకర్యం ఉన్నది. నగదు పంపించేవారు ఎవరికైతే పంపిస్తున్నామో వారి పేరును నగదు బదిలీకి ముందే పరిశీలించుకోవచ్చు. దీంతో ఏప్రిల్ 1 నుంచి నెఫ్ట్, ఆర్టీజీఎస్‌ల ద్వారా నగదు బదిలీ చేసేవారికీ ఈ అవకాశం రానున్నది.

### భారీగా బీమా క్లెయింల తిరస్కరణ..

## హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నవారికి ఆసుపత్రులు షాక్

**15 వేల కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు వెనుకకు**

**రూ.1.2 లక్షల కోట్ల క్లెయింల సెటిల్‌మెంట్**

**2023–24 ఆర్థిక సంవత్సరపు నివేదికలో ఐఆర్‌డీఏఐ**




ఆరోగ్య బీమా తీసుకున్నవారికి ఆసుపత్రులు గట్టి షాకిస్తున్నాయి. క్లెయిం సెటిలమెంట్లలో చాలా కొరివిలు పెడుతున్నాయి. దీంతో వేలాది కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింలు తిరస్కరణకు గురవుతున్నాయి. బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ తాజాగా విడుదల చేసిన నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.15,100 కోట్లు హెల్త్ ఇన్సూరెన్స్ క్లెయింల తిరస్కరించబడ్డాయని తెలిపింది. మొత్తం క్లెయిం సెటిల్‌మెంట్లలో వీటి వాటా 12.9 శాతంగా ఉన్నదని పేర్కొంది. రూ.1.17 లక్షల కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్లలో రూ.83,493.17 కోట్లు లేదా 71.29 శాతం చెల్లింపులు జరిపారని తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. వీటితోపాటు బీమా సంస్థలు రూ.10,937.18 కోట్ల క్లెయింలను తిరస్కరించగా, రూ.7,584.57 కోట్లు చెల్లింపులు జరుపాల్సివున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 3.26 కోట్ల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలు క్లెయింలుకాగా, వీటిలో 2.69 కోట్లు(82.46 శాతం) చెల్లింపులు జరిగాయి. ఒక్కో క్లెయిం సరాసరి రూ.31,086గా ఉన్నట్లు తెలిపింది. క్లెయిం సెటిల్‌మెంట్లలో 66.16 శాతం క్యాష్‌లెస్ పద్ధతిన సెటిల్ కాగా, 39 శాతం రియంబర్స్‌మెంట్ పద్ధతిన జరిగాయని పేర్కొంది.

2023–24లో జనరల్, హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు రూ.1,07,681 కోట్ల ప్రీమియాన్ని వసూలు చేశాయి.

ప్రస్తుతం 25 జనరల్ ఇన్సూరెన్స్, 8 హెల్త్ ఇన్సూరెన్స్ సేవలు అందిస్తున్నాయి

ప్రభుత్వరంగ సంస్థలైన న్యూ ఇండియా, నేషనల్ అండ్ ఒరియంటల్ ఇన్సూరెన్స్‌లు హెల్త్ ఇన్సూరెన్స్ బీమా సేవలు అందిస్తున్నాయి.

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 165.05 కోట్ల మంది వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకున్నారు.

90.10 కోట్ల మందికి ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన పథకాలైన ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన్ మంత్రి జన్‌ధన్ యోజన, ఐఆర్‌సీటీసీల కింద బీమా పొందుతున్నారు.

# ఎస్ఐపీ.. నెలకు రూ.11,111 చొప్పున జస్ట్ 15 ఏళ్లు పెట్టుబడి పెడితే



ఇంటర్నెట్ డెస్క్: మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టాలనుకునేవారి ముందున్న సులభమైన మార్గం క్రమానుగత పెట్టుబడులు.. అంటే సిస్టమాటిక్ ఇన్వెస్టిమెంట్ ప్లాన్ (ఎస్ఐపీ). నెల నెలా ఖర్చులు పోను మిగిలే సొమ్మును ఇన్వెస్టర్లు ఎస్ఐపీ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లోకి మళ్లించవచ్చు. దీంతో, ఒకేసారి భారీ మొత్తాలు తీయాల్సిన అగత్యం తప్పుతుంది. కాంపౌండింగ్ కారణంగా పెట్టుబడులు తరువాతి కాలంలో మంచి రాబడులను అందిస్తాయి. మరి నెలకు ఏయే మొత్తాల పెట్టుబడితో ఏ మేరకు లాభాలు వస్తాయో ఈ కథనంలో తెలుసుకుందాం మీరు నెలకు రూ.11,111 చొప్పున ఎస్ఐపీల్లో 15 ఏళ్ల పాటు పెట్టుబడి పెట్టారని అనుకుందాం. దీంతో, మీ డబ్బు మొత్తం (కార్పస్) రూ.56.06 లక్షలకు చేరుకుంటుంది. ఇందులో సుమారు రూ.20 లక్షలు పెట్టుబడి కాగా ఆపై మొత్తం లాభంగా చేకూరుతుందన్నమాట.

**జనవరి 2025లో బ్యాంక్ సెలవులు.. ఈసారి ఎన్ని రోజులంటే**

ఇక నెలకు రూ.22,222 చొప్పు 10 ఏళ్ల పాటు పెట్టుబడి పెడితే ఆ తరువాత మొత్తం సొమ్ము రూ.51.63 లక్షలకు చేరుతుందన్నమాట. ఇందులో లాభం రూ.24.94 లక్షలు నెలకు రూ.33,333 చొప్పున 7 ఏళ్ల పాటు ఎస్ఐపీలో ఇన్వెస్ట్ చేస్తే మొత్తం సొమ్ము రూ.43.99 లక్షలకు చేరుకుంటుంది. ఇందులో అసలు రూ.28 లక్షలు కాగా మిగిలిన రూ.15.99 లక్షలు రాబడి. దీన్ని బట్టి ఎస్ఐపీల్లో కాంపౌండింగ్‌కు ఉన్న శక్తి ఏమిటో అర్థం చేసుకోవచ్చు.

**రైల్వే టికెట్ యూజర్లకు షాకిచ్చిన ఐఆర్‌సీటీసీ.. కానీ ఇప్పుడు**

ఒక్క ముక్కలో చెప్పాలంటే కాంపౌండింగ్ అంటే వడ్డీప వడ్డీ రాబడిగా అందడం. అంటే.. అసలుకు కొంత వడ్డీ జతకూడాక ఈ మొత్తంపై మళ్లీ వడ్డీ రావడం. ఇలా కాలం గడిచేకొద్దీ లాభం పెరిగినట్లు అవుతుంది. ఎస్ఐపీ విధానంలో ఒకేసారి భారీ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టాల్సిన అవసరం ఉండదు. దీంతో, శాలరీలు తీసుకునే వారికి అత్యంత ఉపయుక్తమైన పెట్టుబడి సాధనమని నిపుణులు చెబుతున్నారు. అయితే, స్పష్టమైన ఆర్థిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని, అందుకు అనువైన ఎస్ఐపీ పథకాలను ఎంచుకుని పెట్టుబడి పెట్టాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా, ఎస్ఐపీ మొదలెట్టాక నెల నెలా క్రమం తప్పకుండా డబ్బులు కట్టకపోతే రాబడిపై ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు.

## న్యూ ఇయర్ ముందు మళ్లీ పెరిగిన బంగారం, వెండి రేట్లు



మీరు ఈరోజు బంగారం, వెండి కొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ఈరోజు బంగారం రేట్లను ఓసారి తనిఖీ చేయండి మరి. ఎందుకంటే కొత్త సంవత్సరానికి ముందు బంగారం, వెండి ధరలు మళ్లీ స్వల్పంగా పెరిగాయి. ఈ క్రమంలో ఈరోజు (డిసెంబర్ 30న) ఉదయం 6.15 గంటల నాటికి 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.71,490కు చేరుకోగా, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.77,980గా ఉంది. ఇది నిన్న 24 క్యారెట్ల బంగారం ధరతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. ఇక వెండి ధరల గురించి మాట్లాడితే నేడు కిలో వెండి ధర రూ.92,300కి చేరుకుంది. ఇది నిన్నటితో పోల్చితే వెయ్యికిపైగా పెరిగింది.

**ఎక్కడెక్కడ ఎలా ఉన్నాయంటే..**

ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 77,840కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ. 71,325కు చేరుకుంది. ఇక ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 77,980కి చేరగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 71,500కి చేరింది. మరోవైపు యూపీ రాజధాని లక్నోలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,490కి చేరగా, 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.77,980 స్థాయిలో ఉంది. ఆగ్రాలోలో కూడా 22 క్యారెట్ గోల్డ్ రేటు రూ. 71,490 కాగా, 24 క్యారెట్ పసిడి రూ. 77,980గా ఉంది. అయితే రానున్న రోజుల్లో ఈ బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

**బంగారం రేట్ల విషయంలో**

దేశంలో బంగారం ధరలు భారత రూపాయి విలువ మార్పు, డాలర్‌ల మధ్య మారకం రేటు, స్థానిక డిమాండ్ వంటి అంశాల కారణంగా మారుతుంటుంది. ముఖ్యంగా దీపావళి వంటి ప్రధాన పండుగల సమయాలు, ప్రపంచ ఆర్థిక పరిణామాలతో సహా అనేక కీలకమైన అంశాలు భారతదేశంలో బంగారం ధరలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. అయితే మీరు బంగారంలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్లయితే రోజువారీ బంగారం ధర గురించి మళ్లీ సమాచారాన్ని తెలుసుకుని నిర్ణయం తీసుకోండి మరి.

**గమనిక:** పైన పేర్కొన్న బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడూ మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే ముందు మళ్లీ రేట్లు తెలుసుకోవాలని సూచన. వీటిలో %+టూ, ఎజూ% వంటి ఇతర ఛార్జీలు కలిగి ఉండవు.

# అదానీ విల్మర్‌కు గుడ్‌బై




**పూర్తి వాటాను అమ్మేస్తున్న గౌతమ్ అదానీ**

**డీల్ విలువ దాదాపు రూ.17,100 కోట్లు**

**విల్మర్ చేతికి మరో 43.94 శాతం వాటా**

**ఇక ఎఫ్ఎంసీజీ రంగానికి అదానీ గ్రూప్ దూరం**

భారతీయ బహుళ వ్యాపార, పారిశ్రామిక రంగ దిగ్గజం గౌతమ్ అదానీ గ్రూప్.. ఎఫ్ఎంసీజీ జాయింట్ వెంచర్ అదానీ విల్మర్ నుంచి తప్పుకుంటున్నది. అందులో ఉన్న మొత్తం వాటాను దాదాపు రూ.17,100 కోట్ల (2 బిలియన్ డాలర్లు)కు అమ్మేస్తున్నట్టు సోమవారం గ్రూప్ ప్రకటించింది. దీంతో ఎఫ్ఎంసీజీ రంగానికే అదానీ గుడ్‌బై చెప్పేస్తుండటం గమనార్హం. నిజానికి ప్రతీ రంగంలోనూ ఆయా కంపెనీలను హస్తగతం చేసుకుంటూ తన ఉనికిని విస్తరిస్తూపోతున్న అదానీ గ్రూప్.. ఇలా రెండున్నర దశాబ్దాల చరిత్ర ఉన్న సంస్థను వదులుకుంటూ ఏకంగా ఓ రంగం నుంచే వైదొలుగుతుండటం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు.

**1999లో..**

సుమారు 25 ఏండ్ల క్రితం 1999 జనవరిలో సింగపూర్‌కు చెందిన కమోడిటీ ట్రేడర్ విల్మర్‌తో కలిసి అదానీ గ్రూప్ ఈ అదానీ విల్మర్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రస్తుతం అదానీ ఎంటర్‌ప్రైజెస్‌కు 43.94 శాతం వాటా ఉండగా, దీనంతటినీ తమ భాగస్వామి విల్మర్ ఇంటర్నేషనల్‌కే అదానీ గ్రూప్ విక్రయిస్తున్నది. 31.06 శాతం వాటాను రూ.12,314 కోట్లకు అమ్ముతున్న అదానీ.. కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ అవసరాలకు అనుగుణంగా మరో 12.88 శాతం వాటాను ఓపెన్ మార్కెట్‌లో దాదాపు రూ.4,786 కోట్లకు విక్రయిస్తున్నది. కాగా, గౌతమ్ అదానీ, ఆయన సంస్థపై అమెరికాలో లంచం నేరారోపణలు వచ్చిన దగ్గర్నుంచి అదానీ గ్రూప్‌లో జరుగుతున్న బిగ్ డీల్ ఇదే. వచ్చే ఏడాది మార్చి 31కల్లా ఈ లావాదేవీ పూర్తికావచ్చన్న అంచనాలున్నాయి.

**ఏఈఎల్‌కు దన్ను**

అదానీ విల్మర్‌లో వాటాలను అమ్మేస్తున్న అదానీ గ్రూప్.. ఇలా వస్తున్న నిధులను కీలక మౌలిక వ్యాపారాల్లో పెట్టుబడిగా పెట్టబోతున్నది. దీంతో అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్)కు మరింత దన్ను లభించనున్నది. ఎనర్జీ, యుటిలిటీ, రవాణా, లాజిస్టిక్స్ తదితర విభాగాల్లో అదానీ పట్టును పెంచుకోవడానికి ఈ సొమ్మును వాడుకోబోతున్నట్టు కంపెనీ తాజా ప్రకటన ద్వారా తెలియవస్తున్నది. ఫలితంగా ఏఈఎల్ సామర్థ్యం మరింతగా పెరుగుతుందని ఇండస్ట్రీ వర్గాల అంచనా. ముఖ్యంగా విమానాశ్రయాలు, అదానీ డిజిటల్ వంటి వాటిపై ఇంకా శ్రద్ధ పెట్టవచ్చని కూడా అదానీ గ్రూప్ భావిస్తున్నట్టు ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఫార్చ్యూన్ బ్రాండ్‌లో వంటనూనె, గోధుమ పిండి, పప్పు ధాన్యాలు, బియ్యం, చక్కెరలను తయారుచేసి మార్కెట్‌లో విక్రయిస్తున్న అదానీ విల్మర్.

దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో సంస్థకు 23 ప్లాంట్లున్నాయి.

2022 ఫిబ్రవరిలో రూ.3,600 కోట్లతో వచ్చిన ఐపీవో ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశం.

ప్రస్తుతం కంపెనీ మార్కెట్ విలువ రూ.42, 785 కోట్లు (5 బిలియన్ డాలర్లు).

గత ఆర్థిక సంవత్సరం (2023–24) అదానీ విల్మర్ ఏకీకృత మొత్తం ఆదాయం రూ.51,555.24 కోట్లుగా నమోదు.

### ముంచిన బ్లూచిప్‌లు కొనసాగుతున్న

# స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర

## సెన్సెక్స్ 451, నిఫ్టీ 169 పాయింట్ల పతనం



దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులు వెళ్లిపోవడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. తీవ్ర ఒడిదొడుకుల మధ్య ట్రేడైన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 450.94 పాయింట్లు నష్టపోయి 78,246.13 వద్ద ముగిసింది. 30 షేర్ల ఇండెక్స్‌లో 23 నష్టపోగా, కేవలం ఏడు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మరోసూచీ నిఫ్టీ 168.50 పాయింట్లు కోల్పోయి 23,644.90 వద్ద ముగిసింది. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన టాటా మోటర్స్ అత్యధికంగా 2.24 శాతం నష్టపోయింది. దీంతోపాటు టైటాన్, టాటా స్టీల్, ఎస్బీఐ, మహీంద్రా, ఎన్‌టీపీసీ, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఇన్ఫోసిస్‌లు నష్టపోయాయి. కానీ, జొమాటో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే మెటల్ రంగ సూచీ అత్యధికంగా 2 శాతం వరకు నష్టపోగా, క్యాపిటల్ గూడ్స్ 1.84 శాతం, సర్వీసెస్, ఇండస్ట్రీయల్స్, కమోడిటీస్ సూచీలు పతనం చెందాయి. మరోవైపు, రూపాయి గింగిరాలు కొడుతున్నది. రోజుకొక కనిష్ఠ స్థాయికి జారుకుంటున్న విలువ మరో చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. దిగుమతిదారుల నుంచి డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి విలువ 4 పైసలు కోల్పోయి 85.52 వద్ద నిలిచింది.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt)APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur . ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell : 6303427710